గురువారం
13-06-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 352
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కోర్టు ప్రాంగణంలో పాక్ అనుకూల నినాదాలు..
గ్యాంగ్‌స్టర్‌కు దేహశుద్ధి

బెంగళూరు : జైలు శిక్ష అనుభవిస్తున్న ఓ గ్యాంగ్‌స్టర్ కర్నాటకలోని బెళగావి న్యాయస్థాన ప్రాంగణంలో పాకిస్తాన్ అనుకూల నినాదాలు చేయడంతో అతనికి దేహశుద్ధి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్యాంగ్‌స్టర్ జయేశ్ పూజారిపై హత్య, బెదిరింపులు వంటి అనేక కేసులు నమోదయ్యాయి. ఓ కేసులో దోషిగా తేలిన అతడు ప్రస్తుతం జైలు జీవితం గడుపుతున్నాడు. ఈ క్రమంలో 2018 నాటికి సంబంధించిన ఓ కేసు విచారణలో భాగంగా పూజారిని కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకెళ్లారు. లోపలికి వెళుతుండగా అతడు హఠాత్తుగా పాక్ అనుకూల నినాదాలు చేశాడు.

కొత్త కొలువు

ఏపీ నూతన సీఎంగా చంద్రబాబు ప్రమాణం

- మంత్రులుగా పవన్, లోకేశ్ సహా 24 మంది
- ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు సహా రాజకీయ, సినీ ప్రముఖుల హాజరు
- ప్రజల సమక్షంలో అట్టహాసంగా ప్రమాణస్వీకారం

2లో

ఆంధ్రప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రజల ఆనందోత్సాహాలు, అభివాదాల మధ్య నారా చంద్రబాబునాయుడు అనే నేను అంటూ ముఖ్యమంత్రి గా ఆయన ప్రమాణం చేశారు. ప్రధాని మోదీ సమక్షంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చంద్రబాబు తో ప్రమాణం చేయించారు. చంద్రబాబునాయుడు అనే నేను... పదం పలకగానే వేదిక వద్ద కోలాహలంగా మారింది. సీఎం చంద్రబాబు అంటూ ప్రజలు నినాదాలు చేశారు. దైవ సాక్షిగా అంటూ పవన్ కళ్యాణ్ ప్రమాణం చేస్తున్న తరుణంలో కేరింతలు ఉత్సాహం గా నెలకొంది. ప్రమాణ స్వీకారం అనంతరం పవన్‌కల్యాణ్ తన సోదరుడు చిరంజీవికి పాదాభివందనం చేశారు.

నేడు బాధ్యతల స్వీకరణ

ఐదు హామీలపై సంతకాలకు ఫైళ్లు సిద్ధం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు గురువారం సాయంత్రం 4.41 గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు.

2లో

ఒడిశాలో కొత్త ప్రభుత్వం

- సీఎంగా మోహన్‌చరణ్ మాఝి ప్రమాణం
- హాజరైన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, మాజీ సీఎం నవీన్

భువనేశ్వర్: ఒడిశా నూతన ముఖ్యమంత్రిగా మోహన్‌చరణ్ మాఝి ప్రమాణ స్వీకారం చేశారు. రాజధాని భువనేశ్వర్‌లోని జనతా మైదానంలో బుధవారం అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో గవర్నర్ రఘుబర్ దాస్ బుధవారం ఆయన చేత ప్రమాణం చేయించారు. మోహన్‌తో పాటు కనక్ వర్ధన్ సింగ్ దేవ్, ప్రవతి పరీదా ఉపముఖ్యమంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. మరికొందరు

- మిగతా 2 లో

బీసీలకు పెద్దపీట

- 8 మందికి కేబినెట్‌లో చోటు
- కాపు-4, కమ్మ-4, రెడ్డి-3, వైశ్య ఒకరు
- ఎస్సీ-2, ఎస్టీ-1, మైనార్టీ-1
- 17 మంది కొత్త వారికి అవకాశం
- కేబినెట్‌లో ముగ్గురు మహిళలు
- జనసేన-3, బీజేపీ-ఒకటి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నూతన మంత్రివర్గం కొలువు తీరింది. సీఎం చంద్రబాబుతో పాటు మరో 24 మందితో గవర్నరు జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ మంత్రివర్గంలో ఎన్డీఏ కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ) సభ్యులకు చోటు దక్కింది. టీడీపీ 20, జనసేన 3, బీజేపీ ఒకటి చొప్పున మంత్రులను కేటాయించారు. ఇందులో కులాల వారీగా చూస్తే 12 మంది ఓసీలకు, బీసీలు-8, ఎస్సీ-2, ఎస్టీ-1, ముస్లిం మైనార్టీ-1 చొప్పున బెర్తులు లభించాయి. వారిలో ముగ్గురు మహిళలకు మంత్రి పదవులు వరించాయి. 12 మంది ఓసీలలో నలుగురు కమ్మ, నలుగురు కాపు, ముగ్గురు రెడ్డి, వైశ్య ఒకరికి అవకాశం లభించింది. జనసేన నుంచి మూడు మంత్రి పదవుల్లో పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్‌కు దక్కాయి. బీజేపీ నుంచి సత్యకుమార్ యాదవ్‌కు కేటాయించారు. మిగిలిన అన్ని మంత్రి పదవులు టీడీపీ సభ్యులకు అవకాశం లభించింది. కొత్తగా 17 మందికి మంత్రి పదవులు లభించాయి. ఓసీ కమ్మ సామాజిక వర్గం నుంచి నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్ (జనసేన), పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికి మంత్రి పదవులు

- మిగతా 2 లో

సీఎం ముఖ్యకార్యదర్శిగా రవిచంద్ర

సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏపీ సీఎం ముఖ్యకార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి ముద్దాడ రవిచంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తాజా ఎన్నికల్లో వైసీపీ ఓటమి చెందడంతో అప్పటివరకు సీఎంవోలో కీలకంగా వ్యవహరించిన అధికారుల స్థానంలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికే కొందరిపై బదిలీ వేటు పడింది. సీఎం చంద్రబాబు సీఎంవోను పూర్తిగా ప్రక్షాళన చేయనున్నట్లు, దీనిలో భాగంగానే ముఖ్యకార్యదర్శిగా రవిచంద్ర నియామకం జరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఆయన గతంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు. మంచి నిజాయతీగల అధికారిగా గుర్తింపు పొందారు. బడ్జెట్ రూపకల్పనలో కీలకంగా వ్యవహరించారు.

సీనియర్లకు దక్కనిచోటు

- మంత్రి పదవుల్లో కొత్తవారికే అందలం
- గంటా, గద్దె, కన్నా, బోండా అసంతృప్తి
- కైకలూరు ఎమ్మెల్యే కామినేనికి అనారోగ్యం
- ఏడు జిల్లాలకు దక్కని ప్రాధాన్యత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ) నుంచి గెలుపొందిన సీనియర్లకు మంత్రి పదవుల్లో చుక్కెదురయింది. కూటమి సభాపక్ష నేత, సీఎం చంద్రబాబు ఝలక్ ఇచ్చారు. ఆశించిన వారికి మంత్రి పదవుల జాబితాలో చోటు దక్కలేదు. చంద్రబాబుతో పాటు 24 మందికి మంత్రి పదవులు వరించగా... అందులో కొత్తగా 17 మందికి చోటు దక్కింది. దీంతో సీనియర్లు అసంతృప్తికి గురవుతున్నారు. ఈ మంత్రి పదవుల్లో అత్యధికంగా 20 టీడీపీ ఎమ్మెల్యేలకే దక్కగా, జనసేనకు 3, బీజేపీకి ఒక్కరితోనే సరిపెట్టారు. దీనిని కూటమి నేతలు

- మిగతా 2 లో

పేదలే నా దేవుళ్లు

- వయనాడ్ లేదా రాయ్‌బరేలీపై తేల్చుకోలేకపోతున్నా
- వారణాసిలో మోదీకి తృటిలో తప్పిన ఓటమి
- కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ

మలప్పురం (కేరళ): సార్వత్రిక ఎన్నికల్లో వయనాడ్, రాయ్‌బరేలీ లోక్‌సభ సీట్ల నుంచి విజయం సాధించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ...తాను ఏ నియోజకవర్గం వదులుకోవాలో అనే సందిగ్ధంలో ఉన్నట్లు బుధవారం అన్నారు. తాను ఏ నిర్ణయం తీసుకున్నా రెండు నియోజకవర్గాల ప్రజలు సంతోషిస్తారని, పేద ప్రజలే తనకు దేవుళ్లని తెలిపారు. లోక్‌సభలో తనకు రెండోసారి విజయం చేకూర్చిన వయనాడ్ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలుపుతూ, 'త్వరలో మిమ్మల్ని చూడాలని ఎదురుచూస్తున్నాను' అని అన్నారు. 'నేను

- మిగతా 2 లో

24 నుంచి పార్లమెంటు సమావేశాలు

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో సరికొత్తగా ఎన్నికైన 18వ లోక్‌సభ ఈనెల 24న తొలిసారి కొలువుదీరనుంది. ఈ విషయాన్ని పార్లమెంట్ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జులై 3వ తేదీ వరకు జరగనున్న ఈ సమావేశాల్లో స్పీకర్ ఎన్నిక, రాష్ట్రపతి ప్రసంగం, ఇతర కీలక అంశాలపై చర్చలు జరుగుతాయన్నారు. రాజ్యసభ 264వ సెషన్ కూడా 24వ తేదీనే ప్రారంభం కానున్నట్లు వివరించారు. జూన్ 27వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. వచ్చే ఐదేళ్లకు ప్రభుత్వ కార్యాచరణను ఆమె వెల్లడించనున్నారు. రాష్ట్రపతి గత ప్రభుత్వ విజయాలను తన ప్రసంగంలో

- మిగతా 2 లో

కువైట్‌లో భారీ అగ్నిప్రమాదం

49 మంది సజీవదహనం

మృతుల్లో అత్యధికులు భారతీయులు

కువైట్: అరబ్ దేశం కువైట్‌లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ భవనంలో మంటలు చెలరేగి 49 మంది సజీవదహనమయ్యారు. అందులో 40 మంది భారతీయులే కావడం మరింత విషాదకరం. జీవనోపాధి కోసం సొంతవాళ్లకు దూరంగా వచ్చి ఓ కంపెనీలో పనిచేస్తున్న వీరంతా దురదృష్టవశాత్తూ ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ మంగాఫ్ నగరంలోని ఆరు అంతస్తుల భవనంలో బుధవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదం జరిగినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ప్రమాద సమయంలో భవనంలో 160 మంది ఉన్నారు. వీరంతా ఒకే కంపెనీలో పనిచేస్తున్నట్లు తెలిపింది. తొలుత వంటగదిలో ప్రారంభమైన మంటలు క్షణాల్లోనే భవనమంతా వ్యాపించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో 35 మంది మంటల్లో కాలి సజీవదహనం కాగా...మరో 14 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల్లో 40 మంది భారతీయులేనని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ప్రమాదంలో మరో 50 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో 30 మంది భారతీయులు ఉన్నారు. ఘటన జరిగిన

- మిగతా 2 లో

ఇదీ లోకం!



ఉద్యోగినులతో 'మస్క్' లైంగిక బంధం

ది వాల్‌స్ట్రీట్ సంచలన కథనం

వాషింగ్టన్: టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌పై మరోసారి సంచలన కథనం ప్రచురితమైంది. తన సంస్థ స్పేస్‌ఎక్స్‌లో పని చేసే మహిళా ఉద్యోగినులతో ఆయన లైంగిక సంబంధం పెట్టుకున్నట్లు తాజా నివేదిక పేర్కొంది. ఇంటర్న్ కోసం వచ్చిన ఓ యువతి కూడా అందులో ఉన్నట్లు తెలిపింది. మస్క్ తన కంపెనీలో మహిళలకు అసౌకర్య వాతావరణం కల్పించారంటూ 'ది వాల్‌స్ట్రీట్ జర్నల్' తాజా కథనంలో ఆరోపించింది. గతంలో ఎలాన్ మస్క్ కంపెనీలో పనిచేసి వెళ్లిపోయిన మహిళల నుంచి వాల్‌స్ట్రీట్ జర్నల్ ఈ వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. మస్క్‌కు డ్రగ్స్ తీసుకునే అలవాటు ఉందని, అప్పుడప్పుడు బోర్డ్ సభ్యులతో కలిసి డ్రగ్స్ తీసుకునేవారని పేర్కొంది. ఈ క్రమంలోనే మహిళా ఉద్యోగులతో లైంగిక సంబంధం పెట్టుకున్నట్లు తెలిపింది. తన పిల్లలకు తల్లి కావాలని ఓ ఉద్యోగినిని ఆయన కోరినట్లు వెల్లడించింది. శృంగారంలో పాల్గొంటే గుర్రాన్ని బహుమతిగా ఇస్తానని 2016లో మస్క్ చెప్పినట్లు మరో మహిళ వివరించినట్లు తాజా కథనం పేర్కొంది. కంపెనీలో మహిళల కంటే పురుషులకే మస్క్ ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు. ఒక్క వేతనం విషయంలోనే వ్యత్యాసం ఉండేదని మాజీ ఉద్యోగిని ఒకరు ఆరోపించారు. మస్క్‌పై వచ్చిన ఈ కథనం సంచలనంగా మారింది. దీనిపై స్పేస్‌ఎక్స్ ప్రెసిడెంట్ అండ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ గ్విన్ స్పందిస్తూ మస్క్‌పై వచ్చిన ఆరోపణలను కొట్టిపారేశారు. 'ఎలాన్ మస్క్‌పై తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేసేందుకే ఈ కథనాన్ని ప్రచురించారు. అదంతా అబద్ధం. అందర్నీ తప్పుదారి పట్టించేందుకు చేసే ప్రయత్నం. నాకు పరిచయమున్న వారిలోకెల్లా మస్క్ ఎంతో మంచి వ్యక్తి. ఆయన గురించి వస్తున్న కథనాలను చూసి ఆశ్చర్యపోతున్నా' అని పేర్కొన్నారు. గూగుల్ సహ వ్యవస్థాపకుడు సెర్గీ బ్రిన్ భార్య నికోల్ షానన్‌తో మస్క్ వివాహేతర సంబంధం సాగించారని ఇటీవల న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రచురించింది. ఈ సంబంధం కారణంగా సెర్గీ దంపతులు విడిపోయారని పేర్కొంది. ఈ క్రమంలోనే మరోసారి మస్క్ గురించి ఇలాంటి ఓ కథనం ప్రచురితమవడం చర్చనీయాంశమైంది.

బైడెన్ కుమారుడు దోషే

తుపాకీ కొనుగోలు కేసులో కోర్టు నిర్ధారణ

విల్మింగ్టన్: తుపాకీ కొనుగోలు సందర్భంగా తప్పుడు సమాచారం ఇచ్చిన కేసులో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కుమారుడు హంటర్ బైడెన్ దోషిగా తేలారు. ఆయనపై మోపిన మూడు అభియోగాల్లోనూ నేర నిర్ధారణ జరిగింది. డెలావెర్‌లోని విల్మింగ్టన్ కోర్టు జడ్జి మేరీఎల్లెన్ నోరీకా... హంటర్ నేరాన్ని నిర్ధారించారు. అయితే శిక్షా కాలాన్ని వెల్లడించలేదు. ఇటువంటి కేసుల్లో 25 ఏళ్ల వరకూ జైలు శిక్ష పడుతుంది. అయితే తొలిసారి నేరానికి పాల్పడినందున అంత కాలం శిక్ష పడకపోవచ్చని భావిస్తున్నారు. నేరాన్ని నిర్ధారించిన జడ్జి... ఎంతకాలం శిక్ష వేయనున్నారనేది వెల్లడించలేదు. ఎప్పటి నుంచి శిక్ష అమలు చేసేదీ చెప్పలేదు. తీర్పు వెలువరించిన వెంటనే హంటర్ భావోద్వేగానికి గురయ్యారు. అక్కడే ఉన్న తన న్యాయవాదితోపాటు సతీమణి మెలిస్సా వద్దకు వచ్చి కౌగిలించుకున్నారు. విచారణ సందర్భంగా బైడెన్ సతీమణి, హంటర్ తల్లి జిల్ బైడెన్ కోర్టుకు వచ్చారు. తీర్పు వెలువరించిన తర్వాత భార్య, తల్లితో కలిసి హంటర్ కోర్టు నుంచి వెళ్లిపోయారు. మీడియాతో మాట్లాడలేదు. కాగా, కోర్టు తీర్పును అంగీకరిస్తున్నానని అధ్యక్షుడు బైడెన్ ప్రకటించారు. ఈ కేసులో తాను కుమారుడి తరపున క్షమాభిక్ష కోరబోనని స్పష్టం చేశారు. కేసు వివరాలు పరిశీలిస్తే...2018లో తుపాకీ కొనుగోలు సందర్భంగా ఆయుధ డీలరుకు ఇచ్చిన దరఖాస్తు ఫారంలో హంటర్ తప్పుడు సమాచారం ఇచ్చారు. తాను అక్రమంగా డ్రగ్స్ కొనుగోలు చేయలేదని, వాటికి బానిస కాలేదని, తనవద్ద అక్రమంగా ఆయుధం లేదని వెల్లడించారు. అయితే అది తప్పని తేలింది. అప్పటికే హంటర్ డ్రగ్స్ అక్రమంగా కొనుగోలు చేశారు. వాటికి బానిసగా మారారు. 11 రోజులపాటు అక్రమంగా ఆయుధం కలిగి ఉన్నారు. కాలిఫోర్నియాలో 1.4 మిలియన్ డాలర్ల పన్ను ఎగవేత కేసులో హంటర్ విచారణను ఎదుర్కొంటున్నారు. కాలిఫోర్నియా కోర్టులో సెప్టెంబరులో ఇది విచారణకు రానుంది.

నేడు బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు గురువారం సాయంత్రం 4.41 గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు. సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో అధికారులు ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో తక్షణమే అమలు చేయాల్సిన ఐదు గ్యారంటీలపై సంతకాలు పెట్టనున్నారు. మెగా డీఎస్సీపై తొలి సంతకం చేయనుండగా. ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుపై మలి సంతకం చేయనున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 సంవత్సరాలకే నెలకు రూ.4 వేల పెన్షన్ ఇస్తామని చంద్రబాబు ఎన్నికల సందర్భంగా ప్రజలకు హామీ ఇచ్చారు. ఎన్షన్ పెంపు ఏప్రిల్ నుంచే వర్తిస్తుందని, ఈ మూడు నెలలకు సంబంధించి బకాయిలు రూ.3 వేలు కలిపి మొత్తం జులై 1వ తేదీన రూ.7వేలు అందజేస్తామని ప్రకటించారు. ఆ మేరకు జులై 1వ తేదీ నుంచి పింఛను రూ.4 వేలకు పెంచుతూ మూడో సంతకం పెట్టనున్నారు. స్కిల్ సైన్సెస్‌పై నాలుగు, అన్న క్యాంటీన్ల ఏర్పాటుపై ఐదో సంతకం చేయనున్నారు. దీనికి సంబంధించిన ఫైళ్లను అధికారులు సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. కేసరపల్లిలో చంద్రబాబు, మంత్రులు ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం అతిథులకు వీడ్కోలు పలికిన చంద్రబాబు... సాయంత్రం ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రులతో సమావేశమయ్యారు. మంత్రివర్గంలో చోటు కల్పించినందుకు చంద్రబాబుకు మంత్రులు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం తాను బాధ్యతలు స్వీకరిస్తానని, మంత్రులకు కూడా ఈలోగా శాఖలు కేటాయింపు చేస్తానని చంద్రబాబు తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి చంద్రబాబు తిరుమల వెళ్లారు. శ్రీవారి దర్శనం అనంతరం గురువారం అమరావతి చేరుకుంటారు.

సీనియర్లకు దక్కనిచోటు

(మొదటిపేజీ తరువాయి)

జీర్ణించుకోలేకపోతున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన సీనియర్లకు మంత్రి పదవులు దక్కకపోవడంతో వారు నిరుత్సాహం చెందారు. టీడీపీ సీనియర్ ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కళా వెంకట్రావ్, అయ్యన్నపాత్రుడు, ధూళిపాళ్ల నరేంద్ర, చింతమనేని ప్రభాకర్, గద్దె రామ్మోహన్, బోండా ఉమామహేశ్వరరావు, శ్రీరామ్ తాతయ్య తదితరులకు మంత్రివర్గంలో చోటు దక్కలేదు. కన్నా లక్ష్మీనారాయణ, రఘురామకృష్ణరాజు, కూన రవికుమార్, నక్కా ఆనందరావు, అఖిల ప్రియ, పరిటాల సునీత తదితరులకు అవకాశం రాలేదు. వైసీపీ నుంచి టీడీపీలోకి వెళ్లి గెలిచిన వారిలో నెల్లూరు జిల్లాకు చెందిన ఆనం రామనారాయణ రెడ్డి, ఏలూరు జిల్లాకు నూజివీడుకు చెందిన కొలుసు పార్థసారథికి మంత్రి పదవులు వరించాయి. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి, గుమ్మనూరు జయరామ్‌కు అవకాశం దక్కలేదు. ఏలూరు జిల్లా కైకలూరు బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌కు మొదటి నుంచి బీజేపీ కోటాలో మంత్రి పదవి వస్తుందని భావించారు. అనూహ్యంగా బీజేపీ నుంచి ఒక్కరికే ధర్మవరం నియోజకవర్గానికి చెందిన సత్యకుమార్‌కు చోటు దక్కింది. కామినేని, సత్యకుమార్ ఇద్దరూ మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు సన్నిహితులుగా ఉన్నారు. అదే సమయంలో సత్యకుమార్‌కు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో మంచి పరిచయాలున్నాయి. ఈ లాబీయింగ్ ఆధారంగా సత్యకుమార్‌కు మంత్రి పదవి వరించినట్లు సమాచారం. దీనిపై కామినేని శ్రీనివాస్ తీవ్ర అసంతృప్తితో ఉండి ఆస్పత్రిలో చేరినట్లుగా ప్రచారం ఉంది. కామినేని శ్రీనివాస్ హైదరాబాద్‌లోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ, వీడియో సందేశాన్ని విడుదల చేశారు. తనకు అనారోగ్యం ఉన్నందువల్లే సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి హాజరు కాలేకపోయానని చెప్పారు. సీఎం చంద్రబాబుకు, మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన అందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఇదే బీజేపీ కోటా నుంచి విజయవాడ పశ్చిమ బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి మంత్రి పదవి ఆశించినా లభించలేదు. విశాఖ జిల్లా నుంచి మరో బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకూ పదవి వరించలేదు. జనసేన నుంచి మంత్రి పదవులు ఆశించిన అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, విశాఖ జిల్లాకు చెందిన వంశీకృష్ణ యాదవ్‌కు చోటు దక్కలేదు. మంత్రి పదవుల్లో అవకాశం లేని కూటమి ఎమ్మెల్యేలలో సీనియర్లకు అసెంబ్లీ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, ప్రభుత్వ చీఫ్ విప్, విప్‌లు తదితర పదవుల పంపకాలు చేపట్టే ఆలోచనలో చంద్రబాబు ఉన్నారు.

మంత్రివర్గంలో ఏడు కొత్త జిల్లాలకు దక్కని ప్రాధాన్యత

మంత్రివర్గ కూర్పులో ఏడు కొత్త జిల్లాలకు చెందిన కూటమి నేతలకు ప్రాధాన్యత దక్కలేదు. ఇందులో ప్రధానంగా ఎన్టీఆర్, విశాఖ, పల్నాడు, వైఎస్ఆర్ కడప, తిరుపతి, అల్లూరి సీతారామరాజు జిల్లాలున్నాయి. ఈ జిల్లాల్లో కూటమి నేతలు గెలిచినప్పటికీ అక్కడ సముచిత స్థానం దక్కలేదు. ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ నగరం నుంచి విజయవాడ తూర్పు టీడీపీ ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్ మూడు సార్లు గెలుపొంది, హ్యాట్రిక్ సాధించారు. ఆయనకు ఈ విడత కచ్చితంగా మంత్రివర్గంలో చోటు దక్కుతుందని ఆశించినా రాలేదు. విజయవాడ సెంట్రల్ టీడీపీ ఎమ్మెల్యేగా బోండా ఉమామహేశ్వరరావు అత్యధిక మెజార్టీతో విజయం సాధించారు. ఆయనకూ బెర్తు దక్కలేదు. పశ్చిమ బీజేపీ ఎమ్మెల్యేగా సుజనా చౌదరి, జగ్గయ్యపేట టీడీపీ ఎమ్మెల్యేగా శ్రీరామ్ తాతయ్య విజయం సాధించినప్పటికీ... మంత్రి పదవి వరించలేదు. ఇక విశాఖ జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉంది. సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఈ ఎన్నికల్లో భీమిలి నుంచి అఖండ విజయం సాధించినా మంత్రి పదవి ఇవ్వలేదు. ఇదే జిల్లా నుంచి విశాఖ తూర్పు టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, విశాఖ ఉత్తరం బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు తదితరులు గెలిచినా ఈ జిల్లాకు మంత్రి పదవి దక్కలేదు. పల్నాడు జిల్లాలోనూ టీడీపీ ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, కన్నా లక్ష్మీనారాయణ, జీవీ ఆంజనేయులు, యరపతినేని శ్రీనివాసరావు, భాష్యం ప్రవీణ్, జూలకంటి భాస్కర్‌రెడ్డి తదితరులు విజయం సాధించినప్పటికీ, ఆ జిల్లాకు మంత్రి పదవి లభించలేదు. వైఎస్సార్ కడప జిల్లాలో మైదుకూరు నుంచి టీడీపీ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి, బీజేపీ తరపున జమ్మలమడుగు ఎమ్మెల్యేగా ఆదినారాయణ రెడ్డి విజయం సాధించినా... ఆ జిల్లాకు మంత్రి పదవి దక్కలేదు. తిరుపతి జిల్లాలోనూ టీడీపీ ఎమ్మెల్యేలుగా చంద్రగిరి నుంచి పులివర్తి నాని, శ్రీకాళహస్తి నుంచి బొజ్జల సుధీర్‌రెడ్డి తదితరులు విజయం సాధించినప్పటికీ. మంత్రి పదవులు దక్కలేదు.

24 నుంచి పార్లమెంటు సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తావించే అవకాశం ఉంది. మరోవైపు ప్రతిపక్షాలు కూడా తొలి పార్లమెంట్ సెషన్‌లో ప్రభుత్వాన్ని కొన్ని అంశాల్లో నిలదీసేందుకు సిద్ధమవుతున్నాయి. 2024 ఎన్నికలలో బీజేపీ 240 సీట్లలో విజయం సాధించింది. దీంతో మిత్రపక్షాలు జేడీయూ, టీడీపీతో కలిసి ఎన్‌డీఏ సర్కారును ఏర్పాటుచేసింది. ఇటీవలే ప్రధానిగా నరేంద్ర మోదీ, ఆయన మంత్రివర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

కొత్త కొలువు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి :

ఏపీలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ఆంధ్రప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు మరో 24 మంది మంత్రులు ప్రమాణస్వీకారం చేశారు. బుధవారం కృష్ణా జిల్లా కేసరపల్లిలో విశాల మైదానంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సభాప్రాంగణంలో వేలాది మంది ప్రజల సమక్షంలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చంద్రబాబునాయుడుతో పదవీ ప్రమాణం చేయించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఇది నాలుగోసారి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండుసార్లు, విభజన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్‌కు రెండోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా నిర్ణయించిన ముహూర్తం ప్రకారం ఉదయం 11.27 నిముషాలకు ఆయన ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉండగా... ప్రధాని రాక ఆలస్యంతో మూడు నిమిషాలు ముందుకు జరిగింది. చంద్రబాబు అను నేను...అనగానే సభా ప్రాంగణం జై చంద్రన్న నినాదాలతో మార్మోగింది. కూటమి నేతలు, టీడీపీ శ్రేణులు తమ స్థానాల్లోనే నిలుచుని చప్పట్లతో అభినందనలు పలికారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబును ప్రధాని మోదీ ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వేదిక వద్ద ఉన్న ప్రముఖులంతా చంద్రబాబుకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆ తర్వాత వరుసగా 24 మంది కొత్త మంత్రులచే గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు. జనసేన అధినేత కొణిదెల పవన్ కల్యాణ్, టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్(జనసేన), పి.నారాయణ, వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్(బీజేపీ), నిమ్మల రామానాయుడు, మహ్మద్ ఫరూఖ్, ఆనం రాంనారాయణరెడ్డి, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్(జనసేన), గుమ్మడి సంధ్యారాణి, బీసీ జనార్దన్‌రెడ్డి, టీజీ భరత్, ఎస్ సవిత, వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఒకరి తర్వాత ఒకరు మంత్రులుగా ప్రమాణం చేశారు. మంత్రులందరూ ప్రమాణం చేసిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌లతో చంద్రబాబు కొత్త కేబినెట్ గ్రూప్ ఫొటో దిగారు. ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

హాజరైన కేంద్ర మంత్రులు, ప్రముఖులు

ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కేంద్ర మంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీ, జేపీ నడ్డా, చిరాగ్ పాశ్వాన్, అనుప్రియా పాటిల్, కింజారపు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస వర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీం కోర్టు మాజీ సీజే ఎన్వీ రమణ, తమిళనాడు మాజీ సీఎం పన్నీరు సెల్వం, కర్నాటక మాజీ సీఎం యడియూరప్ప, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై, మెగాస్టార్ చిరంజీవి, తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్, సినీనటులు శివాజీ, నారా రోహిత్, రాంచరణ్ తదితరులు హాజరయ్యారు. నారా, మెగా కుటుంబసభ్యులు పెద్దసంఖ్యలో విచ్చేసి సందడి చేశారు.

ఆకర్షించిన విదేశీ అతిథులు

చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమానికి వివిధ దేశాల తరపున కాన్సుల్ ప్రతినిధులు హాజరయ్యారు. వీరిలో ఎడ్గర్ పాంగ్ (సింగపూర్ కాన్సుల్ జనరల్, చెన్నై),సిలాయ్ జకీ (ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్), చాంగ్ న్యూన్ కిమ్ (రిపబ్లిక్ ఆఫ్ కొరియా కాన్సుల్ జనరల్, చెన్నై), టకహషి మునియో (జపాన్ కాన్సుల్ జనరల్, చెన్నై) గారెత్ విన్ ఒవెన్ (బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్, హైదరాబాద్), థియర్రీ బెర్త్‌లాట్ (ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్, బెంగళూరు), మహ్మద్ అరిఫుర్ రెహమాన్ (బంగ్లాదేశ్ డిప్యూటీ కాన్సుల్ జనరల్, చెన్నై), ఇవోట్ డెవిత్ (నెదర్లాండ్స్ కాన్సుల్ జనరల్, ముంబయి), జెన్నిఫర్ అడ్రియానా లార్సన్ (యూఎస్ కాన్సుల్ జనరల్, హైదరాబాద్), మహదీ షారోఖీ (కాన్సుల్ జనరల్ ఆఫ్ ఇరాన్, హైదరాబాద్), సెంథిల్ తొండమాన్ (గవర్నర్, ఈస్టన్ ప్రావిన్స్, శ్రీలంక) తదితరులున్నారు.

మెగా బ్రదర్స్‌తో మోదీ సందడి

ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగిశాక వేదికపై కాసేపు సందడి వాతావరణం నెలకొంది. తన దగ్గరకు వచ్చిన పవన్‌ను ప్రధాని మోదీ ప్రత్యేకంగా అభినందించారు. కాస్త దూరంలో ఉన్న ఆయన సోదరుడు చిరంజీవితో ఫొటో దిగాలని కోరగా, మోదీ ఆయన దగ్గరకు వచ్చి పలుకరించి, ఇద్దరి చేతులు పైకి ఎత్తి అభివాదం చేశారు. ఆ తర్వాత ఇద్దరిని దగ్గరకు తీసుకుని ఆప్యాయంగా మాట్లాడారు.

కూటమితో ఏపీ కీర్తి ఉన్నత శిఖరాలకు

ప్రధాని మోదీ ఆకాంక్ష

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆంధ్ర ప్రదేశ్ కీర్తిని ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఏపీలో నూతన ప్రభుత్వ ఏర్పాటుపై ప్రధాని బుధవారం 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ఆంధ్ర ప్రదేశ్ నూతన మంత్రుల ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యా. సీఎంతో పాటు ప్రమాణం చేసిన మంత్రులందరికీ అభినందనలు. రాష్ట్ర యువత ఆకాంక్షలు నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని మోదీ ట్వీట్ చేశారు. రాష్ట్రంలో బుధవారం నూతన ప్రభుత్వం కొలువుదీరింది. ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయనతో పాటు 24 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లిలో అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీతో పాటు కేంద్ర మంత్రులు, సినీ ప్రముఖులు హాజరయ్యారు.

బీసీలకు పెద్దపీట

(మొదటిపేజీ తరువాయి)

కేటాయించారు. కాపు సామాజికవర్గం నుంచి నిమ్మల రామానాయుడు, పవన్ కల్యాణ్, కందుల దుర్గేశ్, నారాయణ విద్యా సంస్థల అధినేత పి.నారాయణ బెర్త్ దక్కించుకున్నారు. రెడ్డి సామాజిక వర్గం నుంచి ఆనం రామనారాయణ రెడ్డి, బీసీ జనార్ధన్ రెడ్డి, మండిపల్లి రామప్రసాద్ రెడ్డికి చోటు లభించింది. ఆర్యవైశ్య నుంచి టీజీ భరత్‌కు కేటాయించారు. బీసీలకు కేటాయించిన ఎనిమిది మంత్రుల్లో బీసీ యాదవ సామాజిక వర్గానికి రెండు మంత్రి పదవులు దక్కాయి. వారిలో కొలుసు పార్థసారథి (టీడీపీ), సత్యకుమార్ (బీజేపీ) ఉన్నారు. కొల్లు రవీంద్ర (బీసీ మత్స్యకార), కె.శ్రీనివాస్ (బీసీ తూర్పు కాపు), కె.అచ్చెన్నాయుడు (కొప్పుల వెలమ), అనగాని సత్యప్రసాద్ (బీసీ గౌడ), వాసంశెట్టి సుభాష్ (శెట్టి బలిజ), సవిత (కురబ) కు మంత్రి పదవులు లభించాయి. కొండెపి ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయ స్వామి (ఎస్సీ మాల), పాయకారావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత (ఎస్సీ మాదిగ), గుమ్మడి సంధ్యారాణి (ఎస్‌టి), ఎన్ఎండీ ఫరూక్ (ముస్లిం మైనార్టీ) కు చోటు లభించింది. ఈ మంత్రివర్గంలో తొలిసారిగా 17 మందికి చోటు లభించింది. వారిలో నారా లోకేశ్, కె.పవన్ కల్యాణ్, మండపల్లి రామ్ ప్రసాద్‌రెడ్డి, వాసంశెట్టి సుభాష్, టీజీ భరత్, ఎస్.సవిత, కందుల దుర్గేశ్, సత్యకుమార్ యాదవ్, కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణి తదితరులున్నారు. గతంలో మంత్రులుగా పనిచేసి, మళ్లీ ఈసారి అవకాశం దక్కించుకున్న వారిలో కింజరాపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, పి.నారాయణ, ఎన్ఎండీ ఫరూక్, ఆనం రామనారాయణరెడ్డి, కొలుసు పార్థసారథి ఉన్నారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారిలో ఆనం రామనారాయణ రెడ్డి, కొలుసు పార్థసారథికి మంత్రి పదవులు దక్కాయి.

చంద్రబాబు మంత్రివర్గం

1.కె.పవన్ కల్యాణ్
2.నారా లోకేశ్
3.కింజారపు అచ్చెన్నాయుడు
4.కొల్లు రవీంద్ర
5.నాదెండ్ల మనోహర్
6.పొంగూరు నారాయణ
7.వంగలపూడి అనిత
8.సత్యకుమార్ యాదవ్
9.నిమ్మల రామానాయుడు
10.ఎన్ఎండి ఫరూక్
11.ఆనం రామనారాయణ రెడ్డి
12.పయ్యావుల కేశవ్
13.అనగాని సత్యప్రసాద్
14.కొలుసు పార్థసారథి
15.డోలా బాల వీరాంజనేయస్వామి
16.గొట్టిపాటి రవి
17.కందుల దుర్గేశ్
18.గుమ్మడి సంధ్యారాణి
19.బీసీ జనార్ధన్ రెడ్డి
20.టీజీ భరత్ 21.ఎస్.సవిత
22.వాసంశెట్టి సుభాష్
23.కొండపల్లి శ్రీనివాస్
24.మండపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి

కువైట్‌లో భారీ అగ్నిప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

భవనం కువైట్‌లోని అతిపెద్ద నిర్మాణ సంస్థకు చెందినదిగా తెలిసింది. ప్రమాదం జరిగిన సమయంలో భవనంలో చాలా మంది నిద్రలో ఉన్నారు. దీంతో ప్రాణనష్టం ఎక్కువగా ఉన్నట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. కువైట్ అగ్ని ప్రమాద ఘటనపై భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 49 మందికి పైగా మరణించారని, మరో 50 మందికి పైగా బాధితులు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరినట్లు తెలిసిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. విషయం తెలిసిన వెంటనే కువైట్‌లోని భారతీయ రాయబారి ఘటనా స్థలాన్ని సందర్శించారని, బాధితులకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ప్రమాదంపై కువైట్ అధికారుల నుంచి మరింత సమాచారం కోసం ఎదురుచూస్తున్నట్లు వెల్లడించారు.

గ్వాలియర్ ఆస్పత్రిలో ఎలుకల స్వైర విహారం

గ్వాలియర్: మధ్యప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వంలో ప్రభుత్వాస్పత్రులు అధ్వాన్నంగా తయారయ్యాయి. గ్వాలియర్ నగరంలోని కమల రాజా ఆస్పత్రిలోని ఓ వార్డులో ఎలుకలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇది గ్వాలియర్‌లోని ప్రభుత్వ గజ్ర రాజా మెడికల్ కాలేజీ కింద మహిళలు, పిల్లల వైద్య సదుపాయం కల్పిస్తున్న కమల రాజా ఆస్పత్రిలోని వార్డుగా పేర్కొంది. రాష్ట్రంలోని ప్రతిపక్ష కాంగ్రెస్ ఎక్స్‌లో ఈ వీడియోని షేర్ చేసింది. 'రోగుల కన్నా ఎలుకలు ఎక్కువ' అంటూ పోస్ట్ చేసింది. బీజేపీ ప్రభుత్వ హయాంలో వైద్య సదుపాయాల తీరుపై విమర్శలు గుప్పించింది. రోగులను, నవజాత శిశువులను ఎలుకల నుండి రక్షించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. 'ఆస్పత్రిని దేవుడే రక్షించాలి. ముఖ్యమంత్రి రోజూ తన దర్బార్‌లో హాజరు నమోదుచేసుకుంటున్నారు' అని ఎద్దేవా చేసింది. 'వికసిత్ భారత్' అంటూ నిత్యం ఊదరగొడుతున్న మోదీ ప్రభుత్వంలోని డొల్లతనాన్ని ఈ వీడియో బట్టబయలు చేస్తోంది. వికసిత్ భారత్ అంటే ఇదేనా అంటూ సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు.

ఆధార్- రేషన్ కార్డు అనుసంధానానికి 3 నెలల గడువు పొడిగింపు

న్యూఢిల్లీ: ఆధార్‌తో రేషన్ కార్డును లింక్ చేయనివారికి కేంద్రం మరో అవకాశం కల్పించింది. దీనికి సంబంధించిన గడువును పొడిగిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. 2024 జూన్ 30తో గడువు ముగియనుండగా... సెప్టెంబర్ 30 వరకు పెంచింది. రేషన్ కార్డులు దుర్వినియోగం అవుతున్న పేరుతో అవకతవకలను అడ్డుకోవడానికి ఆధార్- రేషన్ కార్డ్ లింక్ చేయాలని కేంద్రం గతంలో ఆదేశించింది. ఇప్ప టికే చాలామంది ఆధార్ అనుసంధానం పూర్తి చేశారు. ఆధార్- రేషన్ కార్డు అనుసంధానం వల్ల అర్హులైన వారందరికీ ఆహార ధాన్యాలు అందడంతో పాటు నకిలీ రేషన్ కార్డులు తగ్గే అవకాశం ఉంటుంది. ఇప్పటికీ ఆధార్- రేషన్ కార్డ్ అనుసంధానం చేయనివారు ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. దీనికోసం సమీపంలోని రేషన్ షాప్ లేదా కామన్ సర్వీస్ సెంటర్ సాయంతో లింక్ చేయించుకోవచ్చు. ఆధార్ కార్డ్, రేషన్ కార్డుతోపాటు అవసరమైన పత్రాలు అందించి బయోమెట్రిక్ వెరిఫికేషన్‌తో అనుసంధానం పూర్తి చేయొచ్చు.

ఒడిశాలో కొత్త ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సహా వివిధ బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు హాజరయ్యారు.

మూడో గిరిజన ముఖ్యమంత్రి

గతంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన హేమానంద బిస్వాల్, గిరిధర్ గమాంగ్ మాత్రమే ఒడిశాకు గిరిజన ముఖ్యమంత్రులుగా పనిచేయగా, ఇప్పుడు మాఝి మూడో గిరిజన ముఖ్యమంత్రిగా నిలిచారు. అంతకుముందు మంగళవారం జరిగిన బీజేపీ శాసనసభ పక్ష సమావేశంలో మోహన్‌చరణ్‌ను తమ నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీఎంగా ఎన్నికైన మోహన్ చరణ్ మాఝి ప్రముఖ గిరిజన నేత. ఆయన తండ్రి ఒక సెక్యూరిటీ గార్డుగానూ పనిచేసేవారు. ఆధ్యాత్మిక భావాలు గల మోహన చరణ మాఝి విద్యార్థి దశ నుంచి ఆర్‌ఎస్ఎస్‌కు దగ్గరయ్యారు. డిగ్రీ పూర్తి చేసిన తర్వాత సరస్వతీ విద్యామందిర్‌లో ఉపాధ్యాయునిగా పని చేశారు. తర్వాత న్యాయవాదిగా కొన్నిరోజులు పనిచేశారు. ఆ తర్వాత 1997 నుంచి 2000 వరకు మాఝి సర్పంచిగా పనిచేశారు. బీజేపీ గిరిజన మోర్చాకు ప్రధాన కార్యదర్శిగా ఉండేవారు. న్యాయశాస్త్ర పట్టభద్రుడైన మాఝి, కేంఝర్ అసెంబ్లీ స్థానం నుంచి నాలుగుసార్లు 2000, 2009, 2019, మళ్లీ 2024లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019 నుంచి 2024 వరకు శాసనసభలో బీజేపీ సభాపక్ష కార్యదర్శిగా, చీఫ్ విప్‌గా విధులు నిర్వహించారు. ఇటీవల జరిగిన ఒడిశా శాసనసభ ఎన్నికల్లో బీజేపీ స్వల్ప మెజారిటీతో గెలుపొందిన సంగతి తెలిసిందే. రెండున్నర దశాబ్దాలపాటు రాష్ట్రాన్ని పాలించిన బిజూ జనతాదళ్ ఓటమిపాలైంది. మొత్తం 147 అసెంబ్లీ స్థానాలకు గాను బీజేపీ 78 చోట్ల గెలుపొందగా... బిజు జనతా దళ్ 51, కాంగ్రెస్ 14, ఇతరులు 4 చోట్ల గెలుపొందారు. లోక్‌సభ స్థానాల్లో బీజేపీ మొత్తం 21 లోక్‌సభ స్థానాలకుగాను 20చోట్ల విజయం సాధించగా కాంగ్రెస్ ఓ స్థానంలో గెలుపొందింది. బిజూ జనతాదళ్ ఒక్క స్థానాన్ని కూడా దక్కించుకోలేకపోయింది.

పేదలే నా దేవుళ్లు

(మొదటిపేజీ తరువాయి)

వయనాడ్ ఎంపీగా ఉండాలా లేక రాయ్‌బరేలీ ఎంపీగా ఉండాలా అనే సందిగ్ధత నా ముందు ఉంది. నేను మీకు కట్టుబడి ఉంటాను అంటే వయనాడ్, రాయ్‌బరేలీ రెండూ నా నిర్ణయంతో సంతోషంగా ఉంటాయి' అని కాంగ్రెస్ నాయకుడు ఇక్కడ రోడ్ షోను ఉద్దేశించి మాట్లాడుతూ చెప్పారు. వయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి వరుసగా రెండోసారి భారీ మెజార్టీతో గెలుపొందిన తర్వాత రాష్ట్రంలో ఆయన తొలిసారిగా పర్యటిస్తున్నారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ ప్రధానమంత్రి తరహాలో తనకు దేవుడి నుంచి ఎలాంటి ఆదేశాలు అందడం లేదని మోదీపై మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో మోదీ తాను జీవసంబంధమైన వాడిని కాదని, తన కోసం అన్ని నిర్ణయాలు తీసుకునే దేవుడే తనను భూమిపైకి తెచ్చాడని చెప్పారని రాహుల్ గుర్తుచేశారు. 'అతనికి (మోదీ)లో ఒక విచిత్రమైన దేవుడు ఉన్నాడు. అతను (మోదీ) అదానీ, అంబానీకి అనుకూలంగా అన్ని నిర్ణయాలు తీసుకునేలా చేస్తాడు. దురదృష్టవశాత్తు, అతనిలా కాకుండా నేను దేవుడిచే మార్గనిర్దేశం చేయబడలేదు. నేను మనిషిని' అని వ్యంగ్యాస్త్రం సంధించారు. దేశంలోని ప్రధాన విమానాశ్రయాలు, విద్యుత్ ప్లాంట్‌లను అదానీకి అప్పగించాలని, ఆపై రక్షణ రంగంలో పారిశ్రామికవేత్తలకు సహాయం చేయడానికి 'అగ్నివీర్' తీసుకురావాలని దేవుడు ప్రధానిని ఆదేశించాడని ఆయన ఆరోపించారు. 'నేను దురదృష్టవశాత్తూ మనిషిని, దేవుడు నన్ను ఆదేశించలేదు. అందువల్ల నాకు ఈ విలాసం లేదు. నాకు ఇది చాలా సరళమైనది. నా దేవుళ్లు భారతదేశంలోని పేద ప్రజలు. నా దేవుళ్లు వయనాడ్ ప్రజలు. అందువల్ల నాకు ఇది చాలా సులభం. నేను ప్రజలతో మాట్లాడతాను. నేను ఏమి చేయాలో వారు నాకు చెబుతారు' అని అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో భారత రాజ్యాంగాన్ని పరిరక్షించడం కోసమే పోరాటం చేశామని, ఆ పోరాటంలో ప్రేమ, ఆప్యాయతలతో ద్వేషాన్ని, వినయంతో అహంకారాన్ని ఓడించామని చెప్పారు. ఒకవైపు తమ విభిన్న సంప్రదాయాలు, భాషలు, సంస్కృతులు, చరిత్రలను కాపాడుకోవాలనుకునే కోట్లాది మంది భారతీయులు ఉన్నారని, వారి భవిష్యత్తును తాము నిర్వచించుకుంటామని గాంధీ చెప్పారు. మరోవైపు ప్రధాన మంత్రి, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఏయే భాషలు మాట్లాడాలి, ఏ సంప్రదాయాలు పాటించాలో నిర్ణయిస్తారని విమర్శించారు. మోదీ, షా మధ్య 'ప్రాథమిక అపార్థం' ఉందని లోక్‌సభ ఎంపీ అన్నారు. 'వారు (ప్రధాని, షా) తమకు రాజకీయ అధికారం ఉన్నందున, వారికి ఈడీ, సీబీఐ, ఆదాయపు పన్ను శాఖ ఉన్నందున, వారు ఏమి జరగబోతుందో ప్రజలకు నిర్దేశించగలరు' అని అన్నారు. 'కేరళ, ఉత్తర ప్రదేశ్ ఇతర అన్ని రాష్ట్రాల ప్రజలు మాకు ఏమి కావాలో మీరు మాకు నిర్దేశించలేరని ప్రధానమంత్రికి చూపించారు. భారత ప్రజలు రాజ్యాంగమే మా గొంతు అని, రాజ్యాంగాన్ని ముట్టుకోవద్దు' అని చెప్పారన్నారు. వారణాసిలో ప్రధాని ఓటమి నుంచి తప్పించుకున్నారని, అయోధ్యలో బీజేపీ ఓడిపోయిందనేది సత్యమని ఆయన అన్నారు. 'అందువల్ల అయోధ్య ప్రజలు కూడా మేము ద్వేషం, హింసను మెచ్చుకోము అని బీజేపీకి సందేశం పంపారు. భారతదేశ ప్రజలు ఇచ్చిన అతిపెద్ద సందేశం ఏమిటంటే... మనకు బహుళ సంప్రదాయాలు, రాష్ట్రాలు, మతాలు, చరిత్రలు ఉన్నాయి. వాటిలో ప్రతి ఒక్కటి గౌరవించబడాలి' అని తెలిపారు. అందువల్ల, ప్రధాని మోదీ ఇప్పుడు తన వైఖరిని మార్చుకోవలసి ఉంటుందని, ఎందుకంటే భారతదేశ ప్రజలు ఆయనకు స్పష్టమైన సందేశం పంపారని కాంగ్రెస్ అగ్రనేత అన్నారు. రాజ్యాంగాన్ని మార్చేస్తామని ఎన్నికలకు ముందు బీజేపీ నేతలు ప్రకటనలు చేశారని, కానీ ఎన్నికల తర్వాత మోదీ రాజ్యాంగ పుస్తకాన్ని తన నుదుటికి అద్దుకున్నట్లు గుర్తు చేశారు. కేంద్రంలో ఏర్పాటయిన ప్రభుత్వాన్ని 'వికలాంగ ప్రభుత్వం'గా అభివర్ణించిన ఆయన...ప్రతిపక్ష పార్టీలు బీజేపీని ఘోరమైన దెబ్బ తీశాయని అన్నారు. 'మా దృక్కోణంలో, మా ప్రతిపక్ష పాత్ర కొనసాగుతుంది. మేము దేశంలోని ప్రజల కోసం ఒక ప్రత్యామ్నాయ దృష్టిని ప్రతిపాదించాం. అది పేదల అనుకూల దృష్టి. దాని కోసం మేము పోరాడతాం. భారతదేశాన్ని న్యాయమైన సమాజంగా మార్చడానికి మేము కట్టుబడి ఉన్నాం' అని తెలిపారు.

సీఎం చంద్రబాబుకు శుభాకాంక్షలు

వైఎస్సార్ విగ్రహాలపై దాడులు అరికట్టాలి: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నారా చంద్రబాబు నాయుడుకు కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేస్తూ, చారిత్రక మెజార్టీతో మిమ్మల్ని అధికారంలోకి తీసుకు వచ్చిన ప్రజల ఆశయాలకు, నమ్మకాలకు అనుగుణంగా, రాష్ట్ర అవసరాలను, కఠిన సవాళ్లను దృష్టిలో పెట్టుకుని, సంక్షేమం, అభివృద్ధి, శాంతిభద్రతలను మిళితం చేసి ఇకపై ప్రజారంజక పాలన అందిస్తారన్న ఆకాంక్షను ఆమె వ్యక్తం చేశారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు నుంచీ అటు వైసీపీ నేతలు, కార్యకర్తల మీద, ఇటు డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాల మీద జరుగుతున్న దాడులు మమ్మల్ని ఎంతగానో కలచివేశాయని పేర్కొన్నారు. వారు చేశారని మీరు, మీరు చేశారని భవిష్యతులో మళ్లీ వాళ్లు... ఇలా ఈ పగలకు, ప్రతీకారాలకు అంతు ఉండబోదన్నారు. సభ్య సమాజంలో, ప్రజాస్వామ్యంలో వీటికి చోటు లేదని, ఉండకూడదని తెలిపారు. ఎన్నో తీవ్రమైన సవాళ్ల మధ్య రాష్ట్ర పునర్నిర్మాణం వేగంగా, నిబద్ధతతో జరగాల్సిన ఈ సమయంలో ఇలాంటి హేయమైన చర్యలు, దాడులు, శాంతిభద్రతలకు మాత్రమే కాదని, రాష్ట్ర ప్రగతికి, పేరుకు, అందివచ్చే అవకాశాలకు కూడా తీవ్రమైన విఘాతం కలగజేస్తాయని సూచించారు. గత ఐదేళ్లలో జరిగిన విశృంఖల పాలన, దానివలన అన్ని విధాలుగా నాశనమైన రాష్ట్రాన్ని మళ్లీ గాడిలోపెట్టి ముందుకు తీసుకువెళతారనే ఆశయంతో ప్రజలు మీకు ఈ తీర్పు ఇచ్చారన్నారు. దానికి అనుగుణంగా నడుచుకుని, వైఎస్సార్ విగ్రహాల మీద దాడులు, ప్రతిపక్షాల మీద ప్రతీకార చర్యలు ఇకపై జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్ర ప్రయోజనాల సాధనకు

ఇదే సరైన సమయం

జె.వి.సత్యనారాయణ మూర్తి

విశాలాంధ్ర-కూనవరం: దేశంలో మూడోసారి కొలువుదీరిన ఎన్డీఏ ప్రభుత్వంలో తెలుగుదేశం, జనసేన పార్టీల సహకారం ఎంతో కీలకమైనదని, ఇలాంటి తరుణంలో రాష్ట్ర ప్రయోజనాలను సాధించుకునే దిశగా మోదీ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి డిమాండ్ చేశారు. బుధవారం ఇటీవల గుండెపోటుతో చనిపోయిన సీనియర్ నాయకులు కామ్రేడ్ మండా దుర్గాప్రసాద్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కూనవరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నాలుగు మండలాల కార్యకర్తల సమావేశంలో దుర్గాప్రసాద్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు కందుకూరి స్వర్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ గతంలో రెండు సార్లు కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీకి పూర్తి మెజారిటీ ఉండడంతో గుజరాత్ మినహా ఏ రాష్ట్ర ప్రయోజనాలను ఖాతరు చేయలేదని, దానివల్ల పదేళ్లుగా ఆంధ్ర ప్రదేశ్ ఆర్థికంగా ఎంతో వెనకబడిపోయిందని విమర్శించారు. ఇప్పుడు చంద్రబాబు మద్దతు లేనిదే ఎన్డీఏ మనుగడ కష్టమైనందున ఇదే అదునుగా గతంలో మోదీ ఇచ్చిన హామీలనే నెరవేర్చే దిశగా ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. వాటిలో రాష్ట్ర విభజన హామీలు నెరవేర్చడం, విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయకుండా ఆపడం, రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించుకోవడం, విశాఖ రైల్వే జోన్, పోలవరం ప్రాజెక్టు, ఐటీ రంగం, పారిశ్రామిక రంగం అభివృద్ధికి కేంద్రం పన్ను మినహాయింపులు ఇవ్వడం తద్వారా నిరుద్యోగాన్ని రూపుమాపే దిశగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ కృషి చేయాలని హితవు పలికారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, గత ప్రభుత్వం కొనసాగించిన విధ్వంసకర పాలనను దృష్టిలో పెట్టుకొని కక్ష సాధింపు రాజకీయాల కోసం సమయం వృథా చేయకుండా రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని కొత్త ప్రభుత్వాన్ని కోరారు. పోలవరం ప్రాజెక్టు, రాజధాని నిర్మాణం ఈ రెండిటికి ప్రథమ ప్రాధాన్యతను ఇస్తామని చంద్రబాబు ఇప్పటికే చెప్పిన నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టు అంటే నిర్వాసితుల పునరావాసం, ప్యాకేజీలు అంతకంటే ముఖ్యమైనవని తెలిపారు. వాటిని సాధించే దిశగా ఇప్పుడు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డివిజన్ కార్యదర్శి గుజ్జ మోహన్ రావు, సహాయ కార్యదర్శి వాసం రాము, కూనవరం మండల కన్వీనర్ లంబు శ్రీనివాసరావు, ఎటపాక మండల కార్యదర్శి వెలిశాల నాగరాజు, సీనియర్ నాయకులు జుత్తుక సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు నారాయణ శుభాకాంక్షలు

విశాలాంధ్ర-హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ బుధవారం ఓ ప్రకటనలో హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నూతన మంత్రివర్గ సభ్యులందరికీ అభినందనలు తెలిపారు. 'రాజకీయ శాడిజం'పై అలుపెరగనిపోరాటం సాగించి తెలుగు ప్రజలను చంద్రబాబు విముక్తి చేశారని, చంద్రబాబుకు, పవన్‌కల్యాణ్‌కు విజయాభినందనాలు ప్రకటించారు. రాష్ట్రాభివృద్ధిలో ప్రభుత్వంతో పాటు సీపీఐ కూడా తోడు ఉంటుందని నారాయణ హామీ ఇచ్చారు.

ముగిసిన అమరావతి ఉద్యమం

ప్రభుత్వ మార్పుతో దీక్షలు విరమిస్తున్నట్లు రైతుల ప్రకటన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అమరావతిని ఏకైక రాజధానిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ 1631 రోజులుగా రాజధాని రైతులు నిరవధికంగా చేస్తున్న దీక్షలు ముగిస్తున్నట్లు బుధవారం ప్రకటించారు. 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రివర్స్ టెండరింగ్ పేరుతో అమరావతి రాజధాని నిర్మాణ పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. ఆ తర్వాత కొద్ది నెలలకే శాసనసభలో మూడు రాజధానుల బిల్లు ప్రవేశపెట్టారు. అప్పటినుంచి రాజధాని నిర్మాణానికి ఉచితంగా భూములిచ్చిన రైతులు పోరుబాట పట్టారు. రాజధాని గ్రామాల్లో నిరవధిక దీక్షలు కొనసాగించారు. కరోనా సమయంలోనూ పోరాటం ఆపలేదు. ప్రభుత్వం అనేకవిధాలుగా రైతుల ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రయత్నాలు చేసింది. రైతులపై పోలీసుల ద్వారా దౌర్జన్యానికి పాల్పడడంతో పాటు వేల సంఖ్యలో కేసులు బనాయించింది. న్యాయస్థానం టు దేవస్థానం పేరుతో తిరుమల వెంకటేశ్వరస్వామికి తమ బాధలు చెప్పుకునేందుకు రైతులు పాదయాత్ర ప్రారంభించగా, దానికి అనేక విధాలుగా ఆటంకాలు కల్పించింది. అయినప్పటికీ విజయవంతంగా తిరుపతి చేరుకున్నారు. జగన్ ఆలోచనలు మార్చాలని, లేకుంటే ఆయనను ఓడించి మరలా చంద్రబాబును సీఎంను చేసి అమరావతి రాజధానికి పూర్వవైభవం తీసుకురావాలని రైతులు వెంకటేశ్వరుడిని కోరుకున్నారు. ఆ తర్వాత అమరావతి నుంచి అరసవిల్లికి మరో యాత్ర ప్రారంభించగా, దానిని కూడా భగ్నం చేసేందుకు వైసీపీ శ్రేణులు విశ్వప్రయత్నం చేశారు. ఉత్తరాంధ్ర ప్రజలను రెచ్చగొట్టి ప్రాంతీయ విభేదాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నించడంతో అరసవిల్లి యాత్రను మధ్యలోనే ఆపేసి... రాజధాని ప్రాంతంలో యథాతథంగా దీక్షలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ ప్రభుత్వం మరలా అధికారంలోకి రావడంతో దీక్షలు విరమిస్తున్నట్లు రైతులు ప్రకటించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు మరలా బాధ్యతలు చేపట్టడంతో రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంతో అమరావతికి పూర్వ వైభవం వస్తుందన్న నమ్మకంతో దీక్షా శిబిరాలు తొలగిస్తున్నట్టు ప్రకటించారు. ఉద్యమంలో మొదటి నుంచి వెన్నుదన్నుగా నిలిచిన మీడియాకు రాజధాని రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ దాడులపై రాష్ట్రపతికి వైసీపీ ఎంపీల ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి/దిల్లీ: ఆంధ్ర ప్రదేశ్‌లో వైసీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ దాడులకు పాల్పడుతోందని రాష్ట్రపతికి వైసీపీ ఎంపీలు ఫిర్యాదు చేశారు. ఈమేరకు 27 దాడి ఘటనలపై తగిన ఆధారాలు అందజేశారు. ప్రధాని, కేంద్ర హోంమంత్రి, జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు కూడా ఆధారాలతో ఫిర్యాదు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతలు పరిరక్షించాలని కోరారు. అనంతరం దిల్లీలో వైసీపీ ఎంపీలు విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, మిథున్‌రెడ్డి, మోపిదేవి వెంకట రమణ, గొల్లబాబూరావు తదితరులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడుతూ... ప్రమాణ స్వీకారానికి ముందే చంద్రబాబు హింసను ప్రోత్సహించారని మండిపడ్డారు. అసలు మీరు టీడీపీ కార్యకర్తలా?, గూండాలా? అని ప్రశ్నించారు. ఏపీలో శాంతిభద్రతలను పరిరక్షించాలని రాష్ట్రపతిని కోరినట్లు చెప్పారు. ఏపీలో వారం రోజులుగా టీడీపీ శ్రేణులు దాడులకు దిగుతున్నారని, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ కార్యకర్తలు, వారి ఆస్తులే లక్ష్యంగా టీడీపీ శ్రేణులు దాడులకు దిగుతున్నారన్నారు. బాధితుల ఆక్రందనలు చంద్రబాబుకు కన్పించడం లేదా? అని ప్రశ్నించారు. ఏపీలో రాజ్యాంగం కుప్పకూలిపోయిందని...ఇది చీకటి అధ్యాయంగా చరిత్రలో మిగిలిపోతుందని విమర్శించారు. టీడీపీ దాడులు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయన్నారు. మంగళగిరిలో నారా లోకేశ్‌కు చెందిన కార్యకర్తలు వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తల పట్ల అమానుషంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. మంచిగా ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని టీడీపీ తగలబెడుతోందని, ఈ హింస ఇలాగే కొనసాగితే బీజేపీ కూడా బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. తుదకు మీడియా స్వేచ్ఛనూ అణచివేస్తున్నారని చెప్పారు. దేశ, రాష్ట్ర ప్రయోజనాల ఆధారంగానే పార్లమెంట్‌లో మోదీ ప్రభుత్వానికి వైసీపీ మద్దతు ఉంటుందని విజయసాయిరెడ్డి నొక్కిచెప్పారు. ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో కొనసాగుతున్న అల్లర్లపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని అరికట్టాలని కోరారు. అధికారంలో భాగం పంచుకున్న బీజేపీ వెంటనే స్పందించాలన్నారు. ఒక పథకం ప్రకారమే చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ముందు నాయకులు, కార్యకర్తలపైన దాడులకు పాల్పడుతూ...వారి ఆస్తులను ధ్వంసం చేశారని చెప్పారు. ఈ దాడులపై ప్రధాని, హోంమంత్రికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామని... స్పందన లేకుంటే న్యాయపోరాటం చేస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్నప్పటికీ పోలీసులు స్పందించడం లేదని, ఈ దాడులకు బీజేపీ కూడా బాధ్యత వహించాలన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ... రాజకీయాల్లో ఇలాంటి సాంప్రదాయం మంచిదికాదని, అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.

ఏపీఈఏపీసెట్ ర్యాంకులపై గందరగోళం

ఇంటర్ మార్కుల వెయిటేజీ కలిసిందా?

అయోమయంలో అభ్యర్థులు - స్పష్టత కోసం ఎదురు చూపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ ఇంజినీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈఏపీసెట్-2024) ర్యాంకులపై అభ్యర్థుల్లో గందరగోళం నెలకొంది. ఈ ర్యాంకులను ఈఏపీసెట్ మార్కులు, ఇంటర్ మార్కులతో కలిపి ప్రకటించారా?, లేక ఇంటర్ మార్కుల లేకుండానే విడుదల చేశారా? అనే దానిపై స్పష్టత లేదు. ఏపీ ఈఏపీసెట్-2024 ఫలితాలను ఈనెల 11వ తేదీన ప్రకటించారు. ఈ ఏడాది కూడా ఏపీఈఏపీసెట్‌లో ఇంటర్ వెయిటేజీ మార్కులను కేటాయించారు. దీని ఆధారంగా ఈఏపీసెట్‌లో అభ్యర్థులు సాధించిన మార్కులకు 75 శాతం, ఇంటర్ మార్కులకు 25 శాతం ఆధారంగా ర్యాంకులను ప్రకటించాల్సి ఉంది. ఈఏపీసెట్‌ను 160 మార్కులకు నిర్వహిస్తే... అందులో 75 శాతం వెయిటేజీ ఆధారంగా మార్కులు, ఇంటర్‌లో సదరు అభ్యర్థికి వచ్చిన మార్కుల్లో 25 శాతం కలిపి వెల్లడించాలి. ప్రస్తుతం విడుదల చేసిన ఫలితాల్లో ఇంటర్ మార్కులు లేకుండానే విడుదల చేసినట్లుగా ప్రచారం ఉంది. ఈ ఫలితాల విడుదల సమయంలో ఈఏపీసెట్ వెబ్‌సైట్‌లో ఎలాంటి సమాచారం లేనందున గందరగోళానికి దారితీసింది. దాంతోపాటు రీజియన్లతో పాటు రిజర్వేషన్ల ఆధారంగాను ర్యాంకులు వెల్లడించాలని అభ్యర్థులు కోరుతున్నారు. ఏపీఈఏపీసెట్‌కు రాష్ట్ర వ్యాప్తంగా 3,39,139 మంది విద్యార్థులు ఇంజినీరింగ్, అగ్రికల్చర్ పరీక్షలు రాశారు. ఇంజినీరింగ్ విభాగంలో మొత్తం 2,58,374 మంది పరీక్ష రాయగా, వారిలో 1,95,092 మంది (75.51 శాతం) అర్హత సాధించారు. అగ్రికల్చర్ విభాగంలో 80,766 మంది పరీక్ష రాయగా, 70,352 మంది (87.11 శాతం) అర్హత సాధించారు. వారంతా అయోమయానికి గురవుతున్నారు. ప్రస్తుతం విడుదల చేసిన ర్యాంకులకు ఇంటర్ మార్కులు కలిపినట్లుగానీ లేదా కలపకుండానే ర్యాంకులు విడుదల చేశామనిగానీ ఏపీ ఈఏపీసెట్ కన్వీనర్ ప్రకటిస్తే... అభ్యర్థుల్లో నెలకొన్న గందరగోళానికి తెరపడనుంది. తక్షణమే కౌన్సెలింగ్ నిర్వహణకు చర్యలు చేపట్టాలని అభ్యర్థులు కోరుతున్నారు.

పాడేరు ఘాట్ రోడ్డులో ఘోర ప్రమాదం

లోయలోకి దూసుకుపోయిన లారీ: ముగ్గురి మృతి, 11 మందికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-పాడేరు: అల్లూరి సీతా రామరాజు జిల్లా కేంద్రంలోని పాడేరు ఘాట్ రోడ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు మరణించగా 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం సాయంత్రం పెద బయలు మండల కేంద్రంలో శ్రీ మోదకొండమ్మ అమ్మవారి పండుగకు ఎస్ఎస్‌వీ సౌండ్ సంస్థ స్టేజి వేసి పండుగ ముగించుకొని ఏపీ 31 టీడబ్ల్యూ 7129 లారీలో సౌండ్ బాక్సలతో పాటు పెదబయలు నుంచి అచ్యుతపురం వెళుతుండగా 12 మైళ్లు కూడలి సమీపంలో బ్రేకులు ఫెయిల్ అయ్యి లారీ లోయలో బోల్తా పడింది. లారీపై ప్రయాణిస్తున్న వారిపై సౌండ్ బాక్సులు, ఇతర ఇనుప సామాగ్రి పడటంతో అక్కడికక్కడే హరీష్ (21), లక్ష్మణ్ (24) చనిపోగా... చికిత్స పొందుతూ అశోక్ మృతి చెందారు. ఈ ప్రమాదంలో గణేష్, పవన్, రవి, మోహన్, నితిన్, భారతి, సునాత సూర్య, దీక్షిత, శ్రీను, రాజు, రోహిత్ కుమార్ అనే 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరు పాడేరు జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత ఆసుపత్రి వద్దకు చేరుకుని క్షతగాత్రులను పరామర్శించి, మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు.

నేడు అంజాన్ సంస్మరణ సభ

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్వర్యంలో గురువారం ఉదయం 11 గంటలకు బషీర్‌బాగ్‌లోని ప్రెస్ క్లబ్‌లో అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి కీ.శే.అతుల్ కుమార్ అంజాన్ సంస్మరణ సభ జరుగుతుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాగం హేమంతరావు, పశ్య పద్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సభకు ముఖ్య అతిథులుగా ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి, ప్రొఫెసర్ దొంతి నరసింహారెడ్డి, సోమసుందర్ మర్లా, ఐసీఏఆర్ పుసా, సారంపల్లి మల్లారెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తారా?

మోదీకి జైరామ్ రమేశ్ సూటి ప్రశ్న

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విభజన చట్టం మేరకు ఏపీకి కేటాయించిన ప్రత్యేక హోదా కేటాయిస్తారా? అంటూ ప్రధాని నరేంద్ర మోదీని కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ సూటిగా ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని ఐదు ప్రధాన అంశాలపై ప్రధాని మోదీ స్పష్టత ఇవ్వాలని నిలదీస్తూ ఆయన ట్వీట్ చేశారు. ఏపీ సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన రోజే... ఎన్డీఏ కూటమి లక్ష్యంగా కాంగ్రెస్ తరపున జైరామ్ ప్రశ్నలను సంధించారు. పునర్విభజన చట్టంలోని ఐదు అంశాలపై ఆయన ప్రస్తావించారు. పోలవరం పెండింగ్ నిధులను విడుదల చేస్తారా? అని నిలదీశారు. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ ఆపేస్తారా?, ఏపీలో కొత్త రైల్వేజోన్ హామీని అమలు చేస్తారా? అని అడిగారు. కడప స్టీల్ ప్లాంట్, దుగరాజపట్నం ఓడరేవు, కాకినాడ పెట్రో కాంప్లెక్స్, వ్యవసాయ విశ్వవిద్యాలయం మంజూరు చేస్తారా? అంటూ ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి మోదీ, అమిత్‌షా, ముఖ్య ఎన్డీఏ నేతలు రాష్ట్రానికి విచ్చేశారు. ఇదే సమయంలో మోదీని నిలదీస్తూ జైరామ్ రమేశ్ ప్రశ్నించడం చర్చనీయాంశమైంది.

ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలి : మంత్రి పొన్నం

విశాలాంధ్ర- హైదరాబాద్: హైదరాబాద్ నగర ప్రజలకు వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని విధాల పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ, హైదరాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు మంత్రి పొన్నం ప్రభాకర్ జీహెచ్ఎంసి ఆయా శాఖల ఉన్నతాధికారులకు సూచించారు. జీహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సమావేశ మందిరంలో బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్ జీహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డితో, కమిషనర్ ఆమ్రపాలి కాటాతో కలిసి జీహెచ్ఎంసి మాన్‌సూన్ ప్రిపరేషన్ యాక్షన్ ప్లాన్, శానిటేషన్, వెటర్నరీ, ఫుడ్ సేఫ్టీ, నాలా, యుబిడీ, బక్రీద్ ఏర్పాట్లు, తదితర అంశాలపై, సమీక్షించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసి ఇన్చార్జి కమిషనర్ ఆమ్రపాలి జీహెచ్ఎంసి పరిధిలో మాన్సూన్ ప్రిపరేషన్ యాక్షన్ ప్లాన్‌ను మంత్రికి వివరించారు. ఇప్పటికే పలుమార్లు సంబంధిత శాఖల అధికారులు, జోనల్ కమిషనర్‌లతో సమీక్షించామని, ముందస్తు ఆయా అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అనంతరం ఆయా విభాగాల అధికారులు మాన్సూన్ సంసిద్ధత ప్రణాళికపై, చేపట్టిన చర్యల గురించి మంత్రికి వివరించారు. వర్షాకాలానికి ముందస్తుగా స్టార్మ్ వాటర్ నాలాలలో పూడికతీత తీయడంతో పాటు వాటర్ లాగింగ్ పాయింట్స్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నా మని, జీహెచ్ఎంసి పరిధిలో 141 మేజర్ వాటర్ లాగింగ్ పాయింట్స్ గుర్తించామని, సమస్య పరిష్కారానికి పనులు చేపట్టామని తెలిపారు. అధిక వర్షాలు, వరదల నివారణ ముందస్తు చర్యలలో భాగంగా ప్రమాదాలు నాలాల వద్ద ప్రికాషన్స్ బోర్డు ఏర్పాటు చేస్తున్నామని, మాన్ సూన్ ఎమర్జెన్సీ టీమ్స్, మొబైల్ ఎమర్జెన్సీ టీమ్స్‌ను ఏర్పాటు చేసి 24 గంటలు అప్రమత్తతతో పనిచేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

అడవి బిడ్డల ప్రాణాలకు రక్షణేది?

జోరుగా వర్షాలు... కూలుతున్న మట్టిమిద్దెలు

పాణ్యం మండలంలో భయాందోళనలో చెంచులు

విశాలాంధ్ర-పాణ్యం: సమాజానికి దూరంగా తమ వృత్తులను చేసుకుంటూ జీవనం చేసుకుంటున్న అడవి బిడ్డల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. అడవి బిడ్డల బాగోగులను చూడవలసిన అధికారులు పూర్తిగా గాలికి వదిలివేయడంతో వారి బతుకులు చీకటిమయం అయ్యాయి. వివరాల్లోకి వెళితే నంద్యాల జిల్లా పాణ్యం మండల కేంద్రంలోని ఇందిరా చెంచుగూడెంలో దాదాపు 300 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఎన్నో ఏళ్లుగా ఈ గూడెంలో సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ప్రస్తుతం పది రోజులుగా కురుస్తున్న జోరు వానలకు వీరి బాధలు అన్నీఇన్నీ కావు. తాము నివాసం ఉంటున్న మట్టి మిద్దెలు ఎప్పుడు కూలుతాయో అని ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని గిరిజనులు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. ఇప్పటికే కాలనీకి చెందిన బాపట్ల అంకన్న, తోట నాగేంద్ర, తోట సుంకన్న, తోట నాగులేటి, జయంపు కొత్తూరయ్య, తోట ఈరన్న, అయ్యన్న, మేకల ఈశ్వరయ్య, తోట అంజి, తోట దుర్గమ్మ, బొట్టన్న, జయంపు శ్రీనివాసులు, రంగమ్మకు చెందిన దాదాపు 15 నుంచి 20 మట్టి మిద్దెలు కూలిపోయాయని కన్నీరు పెట్టుకున్నారు. కూలిన మట్టి మిద్దెలు, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లలో ఉండలేక తాము నివాసం ఉంటున్న ఖాళీ స్థలంలో గుడారాలు వేసుకొని ఈదురు గాలులకు చంటి బిడ్డలతో నానా కష్టాలు పడుతున్నారు. రాత్రి వేళల్లో విష పురుగులు సైతం గుడారాలలోకి వస్తుండడంతో నిద్ర లేని రాత్రులు గడుపుతున్నారు. చెంచుగూడెంలో ఇన్ని సమస్యలు విలయతాండవం చేస్తున్నప్పటికీ తమ గూడెం వైపు కన్నెత్తి చూసే అధికారి లేకపోవడం సిగ్గుచేటు అని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ రోజులు వర్షాలు పడినప్పుడు ప్రజలను అప్రమత్తం చేయవలసిన రెవెన్యూ అధికారులు తమకేమీ తెలియదన్నట్లుగా వ్యవహరిం చడం అడవి బిడ్డల పాలిట శాపంగా మారింది. గత వారంలో పాణ్యం బోయపేటలో మట్టి మిద్దె కూలిన ఘటనలో ఒక వృద్ధురాలు మరణించింది. చెంచుగూడెంలో మట్టి మిద్దెలు కూలుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ గ్రామ వీఆర్వో సమాచారం సేకరించకపోవడం అడవి బిడ్డలకు ఆగ్రహానికి గురిచేస్తోంది. చదువు లేని తమ బతుకుల పట్ల అధికారులకు ఎందుకు ఇంత చిన్నచూపు అని అడవి బిడ్డలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఐటీడీఏ అధికారులు ఇందిరా చెంచుగూడెంపై శ్రద్ధ కనబరిచి తమ బతుకులు మార్చాలని అడవి బిడ్డలు వేడుకుంటున్నారు.

సంపాదకీయం

కొలువుదీరిన కొత్త ప్రభుత్వం

ప్రజాస్వామ్య భారత్‌లో ఐదేళ్లకొకసారి పార్లమెంట్‌కు, ఆయా రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరగడం, కొత్త ప్రభుత్వాలు ఏర్పడడం పరిపాటి. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి మే 13వ తేదీన ఒకే దశలో ఎన్నికలు జరగగా, జూన్ 4న వెలువడిన ఫలితాలలో టీడీపీ, జనసేన, బీజేపీతో కూడిన ఎన్డీయే కూటమి అనూహ్య విజయం సాధించిన విషయం విదితమే. కొత్త ప్రభుత్వం బుధవారం కొలువు దీరింది. ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు నాలుగోసారి ప్రమాణస్వీకారం చేశారు. ఉప ముఖ్యమంత్రిగా జనసేన అధినేత పవన్ కల్యాణ్, మరో 22 మంది మంత్రుల చేత రాష్ట్ర గవర్నరు అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయించారు. వీరిలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, చంద్రబాబు కుమారుడు నారా లోకేశ్ కూడా ఉన్నారు. కృష్ణాజిల్లా కేసరపల్లి ఐటీ పార్కు వద్ద జరిగిన ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, సినీ ప్రముఖులు చిరంజీవి, రజనీకాంత్ దంపతులు, రామ్‌చరణ్ తదితరులు హాజరయ్యారు. మంత్రి పదవుల కేటాయింపు విషయంలో చంద్రబాబు లోతుగా కసరత్తు చేసి అత్యధిక సామాజిక వర్గాలకు సమన్యాయం చేస్తూ, సమతుల్యతతో నిర్ణయం తీసుకున్నట్టు కనిపిస్తోంది. చంద్రబాబు కేబినెట్ పాత, కొత్తల సమ్మిళితంగా ఉన్నది. బుధవారం ప్రమాణస్వీకారం చేసిన మంత్రులలో 17 మంది కొత్త వారున్నారు. ముగ్గురు మహిళలకు మంత్రివర్గంలో స్థానం కల్పించారు. బీసీలు ఎనిమిది మంది, ఎస్సీలు ఇద్దరు, ఎస్టీ ఒకరు, ముస్లిం మైనారిటీల నుంచి ఒకరికి, వైశ్యుల నుంచి ఒకరికి అవకాశం దక్కింది. నలుగురు కాపులు, నలుగురు కమ్మ, ముగ్గురు రెడ్లకు అవకాశమిచ్చారు. ఐదేళ్ల క్రితం ఎన్నికల్లో కేవలం 23 స్థానాలకు పరిమితమైనదశ నుంచి అరాచక, విధ్వంసకర పాలన సాగించిన జగన్‌కు ఎదురొడ్డి నిలబడి, చంద్రబాబు అద్భుత విజయం సాధించారు. మిత్రపక్షాలతో కలసి 164 స్థానాలు గెలుచుకున్నారు. 1978లో 28 ఏళ్ల వయసులో ఎమ్మెల్యేగా ఎన్నికై చంద్రబాబు శాసనసభలో ప్రవేశించారు. 1995లో టీడీపీలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో సెప్టెంబరు 1న ఆయన ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రెండు దఫాలు, విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ఒకసారి ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇప్పటి వరకు పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా, పదిహేనేళ్లు ప్రతిపక్షనేతగా పనిచేశారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రజలకు కొత్త తరహా పాలనను పరిచయం చేశారు. శ్రమదానం, ప్రజల వద్దకు పాలన, జన్మభూమి, పచ్చదనం-పరిశుభ్రత, గ్రామీణ మహిళల ఆర్థిక అభ్యున్నతికి డ్వాక్రాసంఘాల ఏర్పాటు, రైతుబజార్ల ఏర్పాటు వంటి అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఆయన స్థాపించిన స్వయం సహాయక సంఘాలు గ్రామీణ పేద మహిళల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చాయి. డ్వాక్రా సంఘాల విజయ గాథలు తెలుసుకోవడానికి దేశ, విదేశీ ప్రముఖులు రాష్ట్రాన్ని సందర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో సాధించిన మహిళా ఆర్థిక స్వావలంబన గురించి బ్రిటన్ పార్లమెంటులో ప్రత్యేకంగా ప్రస్తావించారు.

గత ఐదేళ్ల జగన్ పాలనలో ఉపాధి అవకాశాలు కల్పించే పరిశ్రమలు లేక, ఆర్థిక లోటుతో భవిష్యత్తుపై అనిశ్చితి మేఘాలు ముసురుకున్న పరిస్థితుల్లో ఆయన అపార పరిపాలనా అనుభవం, దార్శనికత రాష్ట్రాన్ని మళ్లీ గాడిన పెడతాయని ప్రజలు గట్టిగా నమ్మారు, అందుకే ఊహించని విజయం చేకూర్చారు. ఇప్పుడు రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబు చేతుల్లోనే ఉంది. రాష్ట్రాన్ని పునర్నిర్మించాల్సిన బృహత్తర బాధ్యత ఆయన భుజస్కంధాలపై ఉంది. జగన్ పాలనలో అన్ని వ్యవస్థలూ విధ్వంసమయ్యాక, ఆర్థికవ్యవస్థ కుదేలయ్యాక వచ్చే ఐదేళ్లూ రాష్ట్రాన్ని పరిపాలించడం నల్లేరుమీద బండి నడక కానేకాదు. దెబ్బతిన్న వ్యవస్థల్ని గాడినపెట్టడం, తీవ్ర నిరాశా నిస్పృహల్లో కూరుకుపోయిన యువతకు మళ్లీ భరోసా ఇచ్చి, ఉపాధి కల్పనకు బాటలు వేయడం, ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడం, అమరావతి, పోలవరం ప్రాజెక్టులను పూర్తిచేయడం, పెట్టుబడిదారుల్లో మళ్లీ విశ్వాసాన్ని పాదుకొల్పి పరిశ్రమల్ని తేవడం అనుకున్నంత సులువుకాదు. సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతూకం పాటిస్తూ పాలన సాగించాలి. 2014లో అధికారం చేపట్టిన తరువాత చంద్రబాబు అనుసరించిన దుష్టవిధానాలు అన్నీఇన్నీ కావు. ప్రతిపక్షాలను అసలు లెక్కచేయలేదు, సమస్యలపై చర్చించేందుకు ఏనాడు అఖిలపక్ష సమావేశం నిర్వహించలేదు, ఉద్యమాలు, పోరాటాలను ఏ విధంగా అణచివేయాలో అన్ని విధాల అణచివేశారు. ఎన్నో కేసులు, నోరు తెరిస్తే నోటీసులు, కాలు కదిపితే అరెస్టులు, ఇదేంటని ప్రశ్నిస్తే వేధింపులు... గృహనిర్బంధాలు...మాట్లాడే స్వేచ్ఛలేక, ప్రశ్నించే హక్కును కోల్పోవడంతో విసిగివేసారి పోయిన ప్రజలు 2019 ఎన్నికలలో వైసీపీకి పట్టంకట్టారు. అధికారంలోకి వచ్చిన వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ విధానాలను మరింత విశృంఖలం చేసి ప్రజలను మరింత విసిగించి దిమ్మ తిరిగేలా సమాధానం ఇచ్చేలా చేసుకున్నారు. ఇకపై విధ్వంసాలు, కక్షసాధింపులు, అరాచక రాజకీయాలు ఉండవని మంగళవారం నాటి ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో చేసిన ప్రసంగానికి చంద్రబాబు నాయుడు కట్టుబడివుండాలి. విశాఖ, కర్నూలు సహా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమాన దృష్టితో, సమగ్రంగా అభివృద్ధి చేస్తామన్న వ్యాఖ్యలను చంద్రబాబు సదా గుర్తుంచుకుని పాలనసాగించాలి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వద్ద తనకున్న పలుకుబడిని ఉపయోగించి, అవసరమైతే పోరాడైనా రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజనహామీల సాధనకు కృషి చేయాలి. శాసనసభలో ప్రాతినిధ్యంతో నిమిత్తంలేకుండా అన్ని ప్రతిపక్షాలను విశ్వాసంలోకి తీసుకోవాలి. సమస్యలపై తరుచూ అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటు చేసి నిర్ణయాలు తీసుకోవాలి. విభజన హామీల అమలుకు అవసరమైతే దిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకువెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. ప్రజాసమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేయాలి. అహంకారంతో విర్రవీగితే పర్యవసానం ఏమిటో 2024 ఎన్నికలు కళ్లకుకట్టినట్టు చూపించాయి. అధికారంలో ఉన్నవారు రేపన్నదే లేనట్టు వ్యవహరిస్తే ఎవరికైనా ఇదే పరిస్థితి ఎదురవుతుందన్న వాస్తవాన్ని గమనంలో ఉంచుకుని పాలన సాగించాలి. సంక్షోభం నుంచి అవకాశాలు సృష్టించుకోవాలని చంద్రబాబు తరుచూ చెపుతుంటారు, చెప్పడమే కాదు... దాన్ని ఆయన ఆచరణలో పెట్టాలి. దేశంలోనే అగ్రశ్రేణి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించాలి. రాజకీయ శాడిజంపై అలుపెరగని పోరాటం చేసి తెలుగు ప్రజలకు ఉపశమనం కలిగించిన చంద్రబాబు ప్రజల అకాంక్షలకు, ఆశలకు అనుగుణంగా పాలన సాగించాలి. సంక్షేమం అభివృద్ధిని కొనసాగిస్తూ శాంతిభద్రతలను కాపాడాలి. గడిచిన ఐదేళ్లలో నష్టపోయిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెడతారని ఆశిద్దాం.

దళిత విప్లవకారుడు రావణ్

సరిగ్గా ఏడాది కిందట ఉత్తరప్రదేశ్‌లోని షహరాన్ పూర్‌లో 37 ఏళ్ల ఓ యువకుడి కడుపులోకి బుల్లెట్లు దింపారు. అయినా బతికి బయట పడ్డాడు. ఆయనమీద కాల్పులు జరపడానికి వచ్చిన వాహనం మీద హర్యానా రిజిస్ట్రేషన్ నంబర్ ఉంది. ఆయనే భీమ్ ఆర్మీ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆజాద్. ఆయన తన పేరు వెనక రావణ్ అని తగిలించుకోవడం దళితులపట్ల సవర్ణుల ఆధిపత్య ధోరణికి నిరసనే. భీమ్ ఆర్మీ దళితుల సంస్థ. ఆజాద్ సమాజ్ పార్టీ అధినేత కూడా. బహుజన నాయకుడు కాన్షీరామ్ జన్మదినం రోజున 2020 మార్చ్ 15న ఈ పార్టీ ఏర్పాటు చేశారు. అంతకుముందే 2014లో సతీశ్ కుమార్, వినయ్‌రతన్‌తో కలిసి భీమ్ ఆర్మీ ఏర్పాటు చేశారు. చదువు ద్వారా దళితులను విముక్తం చేయాలన్నది భీమ్ ఆర్మీ లక్ష్యం. దళితబాలలకోసం ఉత్తరప్రదేశ్‌లో ఈ భీమ్ ఆర్మీ ఉచిత పాఠశాల నిర్వహిస్తోంది. తనమీద హత్యాయత్నం జరిగినా ప్రశాంతంగా ఉండాలని ఆజాద్ తన మిత్రులకు, మద్దతుదార్లకు, భీమ్ ఆర్మీ కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి దాడులను రాజ్యాంగబద్ధంగా ఎదుర్కొందామని నచ్చచెప్పారు. అలా రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాలన్న పట్టుదలవల్లే కావచ్చు ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఉత్తరప్రదేశ్‌లోని నగినా నియోజకవర్గంనుంచి లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. బీజేపీ ప్రత్యర్థి ఓం కుమార్‌ను 1, 51, 473 ఓట్ల తేడాతో ఓడించారు. ఆయనమీద హత్యాయత్నం చేసింది బీజేపీ వారేనని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.

వృత్తిరీత్యా ఆజాద్ న్యాయవాది. ఇంతకుముందు ఆయన యోగీ ఆదిత్యనాథ్ మీద గోరఖ్‌పూర్ నుంచి పోటీచేసి ఓడిపోయారు. ఈసారి సమాజ్‌వాదీ పార్టీ, బి.ఎస్.పి. అభ్యర్థులు రంగంలోఉన్నా ఆజాద్ విజయం

ఒకే ఒక్కడు

సాధించారు. 2027 ఏప్రిల్-మే నెలల్లో సహరాన్‌పూర్‌లో దళితులకు, రాజ్‌పుత్‌లకు మధ్య ఘర్షణ జరిగినప్పుడు ఆజాద్‌ను అరెస్టు చేశారు. చాలా రోజులు ఆయన జైలులో ఉండవలసి వచ్చింది. హై కోర్టు ఆయనకు బెయిలు మంజూరు చేయడంవల్ల విడుదలయ్యారు. ఈ అరెస్టు రాజకీయ వేధింపుల కారణంగా జరిగిందని అప్పుడు హైకోర్టు వ్యాఖ్యానించడం గమనించదగిన అంశం. అప్పుడు ఆజాద్‌ను 1980నాటి జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టు చేశారు. చంద్రశేఖర్ ఆజాద్ తండ్రి గోవర్ధన్‌దాస్ ఓ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపా ధ్యాయుడిగా పనిచేశారు. ఆయన పదవీ విరమణచేసి సొంత ఊరు ఘుమల్‌పూర్ వెళ్తే "ద గ్రేట్ చమార్ ఆఫ్ ఘఖోలీ వెల్కంస్ యు" పెద్ద హోర్డింగ్ పెట్టారు. ఆయనా ఓ మోస్తరు దళిత నాయకుడే.

చంద్రశేఖర్ కేవలం దళిత నాయకుడో, రాజకీయ నాయకుడో కాదు. నిఖార్సైన ఆందోళనకారుడు. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమం కొనసాగిన సమయంలో భీమ్ ఆర్మీ దిల్లీలోని జామా మసీదునుంచి జంతర్ మంతర్ దాకా ప్రదర్శన నిర్వహించా లనుకుంది. కానీ దిల్లీ పోలీసులు అనుమతించలేదు. ఆజాద్, ఆయన మద్దతుదార్లు జామా మసీదు దగ్గరే నిరసన తెలియజేశారు. "నా కొడుకు దళిత విప్లవకారుడు" అంటారు ఆయన తల్లి. అంతర్జాతీయ ఖ్యాతి ఉన్న టైమ్స్ పత్రిక వందమంది భవిష్యత్ నాయకుల పేర్లు ప్రకటించింది. అందులో ఆజాద్ పేరు కూడా ఉంది. ఆయన అంబేద్కర్ సిద్ధాంతాలతో ప్రభావితమైన వారు. కలిసి పనిచేద్దామని బి.ఎస్.పి. అధినేత మాయవతిని ఎన్నిసార్లు అభ్యర్థించినా ఆమె స్పందించలేదు. కానీ ఇప్పుడు ఆయన విస్తృత పలుకుబడిగల దళితోద్యమనేతగా ఎదుగుతున్నారు. ఇటీవలి ఎన్నికల్లో మాయావతి నిష్క్రియాపరత్వం స్పష్టంగా కనిపించింది. ఆమె అనుసరించిన ఈ ధోరణి బీజేపీకే ఉపకరించింది. ఇటీవలి ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో గాలి బీజేపీకి అనుకూలంగా లేకపోవడంకూడా ఆజాద్ విజయానికి దోహదంచేసి ఉండొచ్చు. ప్రతిపక్ష ఐక్య సంఘటన "ఇండియా" ఆజాద్‌ను తమలో భాగస్వామిని చేసుకుని ఉంటే బాగుండేది. అలా జరిగి ఉంటే "ఇండియా" కూటమి మరింత బలోపేతం కావడానికి అవకాశం ఉండేదేమో. ఇప్పుడు ఆజాద్ ఎన్.డి.ఎ.కు మద్దతిస్తారా, "ఇండియా" కూటమి తరఫున నిలబడతారా అన్న చర్చ జరుగుతోంది. లాంఛనంగా ఆయన ఏ పక్షాన నిలుస్తారన్నదానికన్నా బీజేపీ మతతత్వాన్ని కచ్చితంగా వ్యతిరేకించే స్వభావం ఉన్నవారేనని చెప్పడానికి సందేహించనక్కర్లేదు. అయితే ఇటీవలి ఎన్నికల సందర్భంగా ఆజాద్ బీజేపీతో సన్నిహితంగా ఉన్నారన్న వార్తలూ ఉన్నాయి.

నిత్య పోరాటాల్లో నిమగ్నమయ్యే ఆజాద్ మెడలో ఎప్పుడూ నీలి కండువా ఉంటుంది. దళిత ఉద్యమానికి ప్రతీకగా ఉన్న మాయావతి క్రియాశీలంగాలేని నేపథ్యంలో ఆజాద్ ఆ లోటు పూరించే అవకాశమూ ఉంది. భీమ్ ఆర్మీగానీ, ఆజాద్ సమాజ్ పార్టీగానీ ప్రస్తుతం పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోనె ఎక్కువ పలుకుబడి, ప్రచారం ఉన్న వ్యవస్థలు. దళితోద్యమ స్ఫూర్తిని ప్రజ్వలింపచేసే శక్తి సామర్థ్యాలు ఆజాద్‌లో ఉన్నాయి. అందువల్ల భవిష్యత్తులో ఆయన ప్రముఖ దళిత నాయకుడిగా ఎదిగినా ఆశ్చర్యపడనక్కర్లేదు.దళిత ఉద్యమానికీ, బీజేపీ మతత్వ విధానాలకు పొసగదని ఆజాద్ గుర్తించగలిగితే మేలు. ఎన్నికల సర్దుబాట్లు ఎత్తుగడల రీత్యా అవసరమైతే కావొచ్చు. కానీ సామాజిక కార్యకర్తలకు, ఉద్యమకారులకు మతతత్వ రాజకీయాలతో పొసగదు. ఈ విషయాన్ని ఆజాద్ గుర్తించగలగాలి.

అనన్యవర్మ

మోదీ హామీలు బాబు సాధించాలి

చలసాని వెంకటరామారావు

"కడుపునిండా తిండిలేక, ఆకలితో అలమటించే జాతికి మతంగాని, కళగాని, సాంఘిక కట్టుబాట్లుగాని ఉండవని" తొలి భారత ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ తన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' గ్రంథంలో పేర్కొన్నారు. "ఆకలితో బాధపడుతున్న లక్షలాది ప్రజలకు ఏది ఉపయోగపడుతుందో అదే నా మనస్సుకు చాలా అందమైనది" అని నెహ్రూ చెప్పారు. 1944 ఏప్రిల్‌లో 80ఏళ్ల క్రితం నెహ్రూ ఈ మాటలుచెబితే నేడు ఆధునిక ప్రజాస్వామిక వ్యవస్థలో దీనికి భిన్నమైన భావన విన్పించటం ఆందోళన కలిగిస్తున్నది. గత పదేళ్లుగా ఉన్న పాలనా విధానం చూస్తుంటే ప్రపంచ పేదరికంలో మనం 101వ స్థానంలో ఉన్నాము. అయినా ప్రపంచ ఆర్థికరంగంలో భారతదేశం వెలిగిపోతున్నదని ప్రధాని స్వయంగా ప్రచారం చేస్తున్నారు. దేశం 5లక్షల కోట్ల ఆర్థికవ్యవస్థగా పరుగులు పెడుతున్నదని, 26 కోట్ల మంది ప్రజలు దారిద్ర్యరేఖ నుండి బైటపడి ధనవంతులుగా మారిపోయారని ప్రచారం చేస్తున్నారు. రానున్న 5ఏళ్లపాటు 80లక్షల కుటుంబాలకు 5కేజీల ఉచిత బియ్యం పథకాన్ని పొడిగించామని చెబుతున్నారు. ఈ కాలంలో వ్యవసాయానికి కేటాయింపులు తగ్గించారు. పల్లెలకు నిధులు లేవు. ఉపాధి హామీ పథకానికి నిధులు కోతపెట్టారు. నిరుద్యోగం స్వాతంత్ర్యానంతరం అత్యున్నత స్థానంలోఉంది. కలల ప్రపంచంలో ప్రజలను జీవింప చేస్తున్నారు. పేదల కడుపునింపాల్సిన పాలకులు పేదల రక్తమాంసాలు ఓడ్చి గత 10ఏళ్లలో 15లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కార్పొరేట్ల బకాయిల రద్దుకు వినియోగించారు. పేదల కన్నీరు, నెత్తురులను కార్పొరేట్లకు తర్పణ చేశారు. సుసంపన్నమైన, బహువిధమైన, వైవిధ్య భరితమైన భారత దేశాన్ని కల్లోల భారతంగా మార్చివేశారు.

ఈ నేపథ్యంలో 18వ లోక్‌సభకు సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. మతోన్మాద శక్తులకు, లౌకికవాదానికి, నియంతృత్వానికి, ప్రజాస్వామ్యానికి, మనుధర్మానికి భారత రాజ్యాంగానికి మధ్యన ఈ సంకుల సమరం సాగింది. ప్రజాతీర్పు, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలకు అనుకూలంగా వచ్చింది. బీజేపీ కూటమి మూడింట రెండింతల మెజారిటీ సాధించాలనే కలలను కల్లలు చేసింది. పూర్తి మెజారిటీతో భారత రాజ్యాంగ స్వరూపాన్నే మార్చి వేయాలని, అధ్యక్ష తరహా పాలనా విధానాన్ని ప్రవేశపెట్టాలనే బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ దుష్టపన్నాగాలపై నీళ్లు చల్లింది. స్వంతంగా తాము 370 సీట్లు సాధిస్తామని దేశమంతా ఊదరకొట్టిన ప్రధాని మోదీ ప్రచారాన్ని ప్రజలు నిరాకరించారు. బీజేపీని కేవలం 240 స్థానాలకే పరిమితం చేశారు. ఒత్తిడి మోసం ద్వారా బలవంతపు మిత్రత్వం చేస్తున్న జేడీయూ, టీడీపీ వంటి పార్టీల మద్దతులేకుండా ఎటువంటి నిర్ణయం చేయలేని అసహాయ ప్రధానిగా మోదీని ప్రజలు కట్టడిచేశారు. ఎన్నికల సందర్భంగా ప్రతిపక్ష పార్టీలపైన, నాయకులపైనా ఎన్నో ఆంక్షలు విధించారు. దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్‌లను అరెస్టుచేసి జైలులో పెట్టించారు. రాజ్యాంగ సంస్థలైన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఎన్నికల కమిషన్(ఈసీ) ఎలక్ట్రానిక్

మిషన్స్ (ఈవిఎం)లను తమ అదుపులో ఉంచుకుని ఎన్నికల క్రమాన్ని శాసించాలని ప్రయత్నించారు. ఆదాయపు పన్ను శాఖను వినియోగించి ప్రతిపక్షనాయకుల, అభ్యర్థులపై ఒత్తిడితెచ్చే ప్రయత్నం చేశారు. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌పార్టీ బ్యాంకు ఖాతాలను స్తంభింపచేసి వారు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా, పార్టీ నిధులను ఎన్నికల నిమిత్తం వినియోగించకుండా కట్టడిచేశారు. అయినా బీజేపీ అత్తెసరు స్థానాలతో మిత్రులపై ఆధారపడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవలసివచ్చింది. గత సంవత్సర కాలంగా ప్రజావ్యతిరేకతను గమనించిన బీజేపీ పార్టీ కేంద్రంలో అధికారాన్ని వినియోగించి మహారాష్ట్రలో ఎన్‌సీపీ పార్టీని, శివసేన పార్టీలను నిలువునా చీల్చివేసి చీలిక వాదులను తమ కూటమిలో చేర్చుకున్నారు. ఇండియాకూటమి ఏర్పాటులో ముఖ్యభూమిక వహించిన బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌ను మోదీ తమవైపు లాక్కున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నాయకుడు 'చంద్రబాబును అరెస్టు చేయడంలో పరోక్షంగా సహకరించి వత్తిడిచేసి ఎన్‌డీఏ కూటమిలో చేర్చుకున్నారు. ఇలా వత్తిడి, భయోత్పాత వాతావరణం సృష్టించడం ద్వారా ఫిరాయింపులను ప్రోత్సహించారు. దీనికితోడు జనవరిలో అసంపూర్తిగా ఉన్న అయోధ్య బాలరాముని మందిరాన్ని సాంప్రదాయాలకు భిన్నంగా ప్రధానమంత్రి ప్రారంభించి రామనామాన్ని వల్లించడం ద్వారా రాజకీయ ప్రయోజనం పొందాలని చూశారు. ఎన్నికల ప్రచారంలో ముస్లిం వ్యతిరేకతను తీవ్రస్థాయిలో ప్రధాని రెచ్చగొట్టారు. హిందూ మహిళలు పవిత్రంగా భావించే మంగళసూత్రాలను సైతం కాంగ్రెస్ కొల్లగొట్టి ముస్లింలకు పంచివేస్తారని అసత్య ప్రచారానికి ప్రధాని వడిగట్టారు. మత వైషమ్యం, కుల సమస్యలను, రిజర్వేషన్ అంశాలను ఎన్నికల ప్రచార అస్త్రాలుగా వినియోగించారు. ఎన్‌డీఏ కూటమి 293 స్థానాలతో సరిపెట్టుకోవలసి వచ్చింది. 2019 ఎన్నికల తరువాత తనకు ఎదురులేదని నిరంకుశంగా ప్రజాభిప్రాయాన్ని గౌరవించకుండా, కార్పొరేట్‌వర్గాల ప్రయోజనాలకు అనుగుణంగా మోదీ ప్రభుత్వం వ్యవహరించడం, రైతులు, పేదలను విస్మరించింది. చివరకు అయోధ్యలో బాలరాముడు కొలువై ఉన్న ఫైజాబాద్ స్థానాన్ని సైతం కోల్పోయింది. 2019లో 6లక్షల 70వేల మెజారిటీ తెచ్చుకున్న మోదీ వారణాశిలో 1.5లక్షల మెజారిటీతో గట్టెక్కవలసివచ్చింది.

ప్రతిపక్ష ఇండియాకూటమి కీలక రాష్ట్రాలలో సీట్ల సర్దుబాటు ద్వారా ఐక్యంగా కలిసి పోటీచేసి సత్ఫలితాలను సాధించారు. కానీ బీజేపీని అధికారంలోకి రాకుండా నిరోధించలేకపోయాయి. ఇండియా కూటమి ప్రధాన భాగస్వామి కాంగ్రెస్ పార్టీ కొన్ని రాష్ట్రాలలో ఇచ్చిపుచ్చుకునే ధోరణిని అనుసరించిఉంటే గెలుపుకు అవసరమైన 272 మార్కుకు దగ్గరకువచ్చి ఉండేది. దీనికితోడు బీజేపీ మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉత్తరాది హిందీ రాష్ట్రాల నుండి పోటీచేసి బీజేపీని ప్రత్యక్షంగా ఢీ కొట్టవలసిన కాంగ్రెస్ ముఖ్య నాయకుడు రాహుల్‌ను ఇండియా కూటమిలో ప్రముఖపాత్ర వహిస్తున్న వామపక్ష సీపీఐ అభ్యర్థిని అనీ రాజాపై పోటీ పెట్టడం సరైందికాదు. బీజేపీతో ముఖాముఖి తలపడటంలో రాహుల్ పిరికితనం ప్రదర్శించారనే విమర్శకు ఆస్కారం కలిగింది. చివరిదశలో ఎన్నికలు జరిగిన రాయ్‌బరేలి నుండి ఆయన పోటీ చేయవలసి వచ్చింది. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్నాటక, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలలో మరికొంత ఎన్నికల కోసం జాగ్రత్తలు తీసుకుని ఉంటే పరిస్థితి వేరుగా ఉండేది.

ఒడిశాలో సీట్లు సాధించడంలో కాంగ్రెస్, బీజేపీలు విఫలం కావడం కూడా ఇండియా కూటమికి నష్టం కలిగించింది. ఇండియా కూటమి ఏర్పడిన తొలినుండి దేశవ్యాప్తంగా ప్రజలను సమీకరించి కూటమి ఐక్యతను ప్రజల ముందుకు తీసుకు వెళ్లలేకపోయారు. కూటమిలోని పార్టీలు అంతర్గతంగా ఒకరిపై ఒకరు విమర్శలకు పాల్పడటం, పరస్పరం సీట్లు సర్దుబాటు చేసుకుని, ఐక్య అభ్యర్థులను నిలపడంలో వైఫల్యం చెందారు. దేశ రాజధాని దిల్లీలో సైతం ఆప్, కాంగ్రెస్‌లు సర్దుబాటుతో కలిసి పోటీ చేసినా మొత్తం 7సీట్లలో ఓటమి చవిచూడవలసివచ్చింది. ప్రస్తుతం బీజేపీ తమతో సైద్ధాంతికంగా భావసారూప్యత లేని పార్టీలతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. గతంలోవలె అహంభావం, పెత్తందారీ నిరంకుశ పాలనను మోదీ విడనాడకపోతే సంకీర్ణంలో ముసలం తప్పదు. అలాగే దక్షిణప్రాంత రాష్ట్రాల ప్రయోజనాలను విస్మరిస్తే తగిన మూల్యం చెల్లించవలసి వస్తుంది. కేంద్ర ప్రభుత్వంలో తెలుగుదేశం రెండవ ప్రధాన భాగస్వామిగాఉంది. గతంలో సాధించలేకపోయిన 'ప్రత్యేక హోదా, పోలవరం పూర్తి, రైల్వే జోన్, రాజధాని అభివృద్ధి నిధులు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, విశాఖ ఉక్కు పరిరక్షణ వంటి అంశం' లో ప్రధానమంత్రి మోదీని ఒప్పించి వీటిని సాధించాలి. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న తక్షణ సమస్యలు నిరుద్యోగం, అధికధరలు, ప్రజలపై పన్నుల భారం, ఉపాధికల్పన, కార్పొరేట్ దోపిడీ నివారణ, ప్రభుత్వ రంగ పరిరక్షణ, నల్లధనం అదుపు వంటి అంశాలలో తెలుగుదేశం క్రియాశీలకంగా వ్యవహరించాలి.

సీపీఐ రాష్ట్ర సమితిసభ్యులు
సెల్: 949095 2093

ముస్లింలకు చోటేది?

ఎం. మురళీకృష్ణ

కేంద్రంలో సొంతంగా మెజారిటీ సాధించలేకపోయినా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుత్తాధిపత్యాన్ని తిరిగి నెలకొల్పడానికి, మరింత బలోపేతం కావడానికి ప్రయత్నాలు సాగుతునే వున్నాయి. హిందూత్వ నిరంకుశవాద ధోరణులను, హిందూత్వ-కార్పొరేట్ సంబంధాలను బలోపేతంచేసే ప్రయత్నాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి. ఎన్నికలలో ప్రజలు ఎన్డీయేకు తగిన పాఠం నేర్పినా దాని వైఖరిలో మాత్రం ఎటువంటి మార్పులేదనడానికి ప్రబల నిదర్శనం కేంద్ర కేబినెట్‌లో ముస్లింలకు ప్రాతినిధ్యం లేకపోవడం. కేబినెట్‌లో ముస్లింలకు ప్రాతినిధ్యం కల్పించక పోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమౌతున్నాయి. 18వ లోక్‌సభకు ఎన్డీయే భాగస్వామ్య పక్షాలనుంచి ఒక్క ముస్లిం అభ్యర్థి కూడా ఎన్నికకాకపోవడం వల్ల ముస్లింలకు కేబినెట్‌లో చోటుకల్పించ లేకపోయారనేది కేవలం సాకు మాత్రమే. తమకు కావాల్సిన వారికి ఎన్నికలలో ఓడిపోయినా మంత్రిపదవి కట్టబెట్టినప్పుడు ముస్లింలకు ఎందుకు కేటాయించలేకపోయారని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల బీజేపీలోకి వచ్చిన పంజాబ్ నేత, పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్ మనవడు రవ్‌నీత్ సింగ్ బిట్టు లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ ఆశ్చర్యకరంగా కేబినెట్‌లో చోటు కల్పించారు. సిక్కుల ప్రాబల్యం ఉండే ఆప్ పాలిత పంజాబ్‌లో పార్టీ బలోపేతానికి బీజేపీ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 77 ఏళ్ల కాలంలో కేంద్ర కేబినెట్‌లో ముస్లింలకు ప్రాధాన్యత లేకపోవడం ఇదే మొదటిసారి. కేబినెట్‌లో మాత్రమే కాదు ఎన్డీయే కూటమిలో లోక్‌సభకు ఎన్నికైన ముస్లిం ప్రతినిధే లేకపోవడం విచారకరం. 75 ఏళ్ళు పైబడిన వారికి మంత్రి పదవులు లేవంటూ బీజేపీ తనకుతాను విధించుకున్న స్వీయనిబంధనలకు మోదీ తిలోదకాలిచ్చారు. మోదీ గత కేబినెట్‌లో ముస్లింనేత ముక్తార్ అబ్బాస్ నఖ్వీ మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రిగా 2022 వరకు పనిచేశారు. ఆయన 2021 జులై 19 నుంచి 2022 జులై4 వరకు కేంద్ర మంత్రిగా పనిచేశారు. రాజ్యసభకు తిరిగి ఎన్నికకాలేదన్న సాకుతో ఆయనను కేబినెట్ నుంచి తొలగించారు. 2014లో మోదీ మంత్రివర్గంలో ముస్లిం నేత నజ్మా హెప్తుల్లా మంత్రిగా పనిచేశారు. 1999లో వాజ్‌పేయి మంత్రివర్గంలో ముస్లిం నేతలు షానవాజ్ హుస్సేన్, ఒమర్ అబ్దుల్లా మంత్రులుగా పనిచేశారు. 1998లో వాజ్‌పేయి మంత్రివర్గంలో నఖ్వీ మంత్రిగా పనిచేశారు. 75 ఏళ్లు దాటిన వారికి ప్రభుత్వంలో పదవులుఇచ్చే ప్రసక్తే లేదన్న సాకుతో నజ్మాహెప్తుల్లాను మంత్రి పదవినుంచి తొలగించారు. కేబినెట్‌లో 75 ఆపై వయసున్న మంత్రులను 2016 జూన్‌లో మోదీ తొలగించారు. వయసు కారణంగానే వీరిని తప్పించామని అప్పట్లో చెప్పుకొచ్చారు.

2014 ఎన్నికల్లో లభించిన విజయంతో విర్రవీగిన మోదీ అప్పటి నుంచే ఈ ప్రక్రియను ప్రారంభించారు. ఆ ఎన్నికల్లో బీజేపీ తొలిసారిగా సొంత బలంపై అధికారంలోకి వచ్చింది. పరిపాలనా సంబంధమైన పదవులకు వయస్సుపైబడిన నేతలను దూరంగా ఉంచాలని మోదీ అప్పుడే నిర్ణయించారు. 75ఏళ్లు పైబడిన ఎల్‌కే అద్వానీ, మురళీ మనోహర్ జోషీ, యశ్వంత్ సింగ్ వంటి నేతలకు సైతం కేబినెట్ నుంచి ఉద్వాసన పలికారు. 2016 జూన్‌లో మోదీ మంత్రిమండలిని విస్తరించడానికి ముందు ఆరుగురు మంత్రుల నుంచి రాజీనామాలు తీసు కున్నారు. 76 సంవత్సరాల వయస్సున్న నజ్మా హెప్తుల్లా కేబినెట్‌లో సీనియర్ మంత్రి. ఆమె మైనారిటీ వ్యవహారాల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2016 జులై 12న నజ్మా తన పదవికి రాజీనామా చేశారు. అనంతరం ముక్తార్ అబ్బాస్ నఖ్వీకి ఆ బాధ్యతలు అప్పగించారు. వయసు మీరినప్పటికీ నజ్మాను మణిపూర్ గవర్నరుగా పంపారు. నజ్మా మంత్రిపదవికి రాజీనామాచేసే సమయానికి కేబినెట్‌లో 75 ఏళ్ల వయస్సుదాటిన మరో మంత్రి ఉన్నారు. ఆయనే కల్‌రాజ్ మిశ్రా. అయితే, 75ఏళ్ల పైబడిన వారికి కేబినెట్‌లో బెర్త్ లేదనే నిబంధన ఆయనకు వర్తించలేదు. ఆయన కేబినెట్‌లో 2017 వరకు కొనసాగారు. కల్‌రాజ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు సమీపిస్తుండడంతో ఆ రాష్ట్రంలో రాజకీయ లబ్ధిపొందేందుకు కల్‌రాజ్‌ను మంత్రిపదవి నుంచి కదపలేదు. యూపీ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత 75ఏళ్ల పైబడిన వారికి కేబినెట్‌లో బెర్త్ లేదనే నిబంధన గుర్తుకు వచ్చింది. 2017 సెప్టెంబరులో కల్‌రాజ్ మంత్రి పదవికి రాజీనామా చేశారు. తన వయస్సు 77 సంవత్సరాలని, అందుకే రాజీనామా చేస్తున్నానన్న ఆయన ప్రకటన బీజేపీ అవకాశవాద రాజకీయానికి దర్పణంగా నిలిచింది. ఇప్పుడు ఈ వయస్సు నిబంధన బీజేపీకి ముఖ్యంగా మోదీకి తలనొప్పిగా మారింది. ఈ ఏడాది సెప్టెంబరు 17న మోదీ 75వ ఏట అడుగు పెడతారు. నిబంధనల మేరకు ఆయన కూడా రాజీనామా చేస్తారా అన్న విషయం ఆసక్తిగా మారింది. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సార్వత్రిక ఎన్నికల ప్రచారం సందర్భంగా అనేక సందర్భాల్లో ఈ విషయాన్ని గుర్తు చేశారు. అయితే దీనిపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా వివరణఇస్తూ బీజేపీ నిబంధనావళిలో వయసుకు సంబంధించి ఎలాంటి నిబంధనలు లేవని, రాబోయే ఐదు సంవత్సరాలు కూడా మోదీయే ప్రధానిగా కొనసాగుతారని తెలిపారు. పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా ఆయనకు వంతపాడారు.

ఆర్‌ఎస్‌ఎస్ అసంబద్ధంగా మారింది

భగవత్ వ్యాఖ్యలపై కాంగ్రెస్

న్యూఢిల్లీ : రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) అసంబద్ధం అయిందని కాంగ్రెస్ బుధవారం పేర్కొంది. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, సమాజానికి సంఘ్ లేదా దాని అధ్యక్షుడు మోహన్ భగవత్ అవసరం లేదని, ఎందుకంటే వారు తమను తాము రక్షించుకోగలరని తెలిపింది. మణిపూర్ హింసాకాండ, ఇప్పుడే ముగిసిన లోక్‌సభ ఎన్నికలతో సహా అనేక అంశాలపై భగవత్ చేసిన వ్యాఖ్యల తర్వాత ప్రతిపక్ష పార్టీ ఈ ప్రకటన చేసింది. కాంగ్రెస్ మీడియా, పబ్లిసిటీ హెడ్ పవన్ ఖేరా మాట్లాడుతూ 'మోహన్ భగవత్ జీ, మీరు ఏమి విత్తుతారో దాన్ని పండిస్తారు. తప్పు మట్టిది కాదు. తోటమాలిది' అని అన్నారు. 'దేశ రాజధాని వెలుపల రైతులు పోలీసుల ఆగ్రహాన్ని ఎదుర్కొంటున్నప్పుడు మీరు మౌనంగా ఉన్నారు. హత్రాస్‌లో దళిత బాలికపై అత్యాచారం, హత్య జరిగినప్పుడు మీరు మౌనంగా ఉన్నారు. బిల్కిస్ బానోపై అత్యాచారానికి ఒడిగట్టిన దోషులను విడుదల చేసినప్పుడు మీ భావజాలం గల సోదరులు వారిని స్వాగతించారు. దళితులపై మూత్ర విసర్జన చేస్తున్నప్పుడు మీరు మౌనంగా ఉన్నారు. పెహ్లూ ఖాన్, అఖ్లాక్‌ను చంపినప్పుడు మీరు మౌనంగా ఉన్నారు. బీజేపీతో కన్హయ్య లాల్ హంతకుల సంబంధాలు బట్టబయలైనప్పుడు మీరు మౌనంగా ఉన్నారు. మీ మౌనం, నరేంద్ర మోదీ మిమ్మల్ని, సంఘ్‌ను అప్రస్తుతం చేశారు. అమిత్ షా, బీజేపీ మిమ్మల్ని అప్రస్తుతం చేశాయి. రాజ్యాంగాన్ని మార్చాలని బీజేపీ నేతలు మాట్లాడుతున్నప్పుడు మీకు ఆఖరి అవకాశం ఉంది. మీరు మాట్లాడాల్సింది కానీ మీరు అలాగే మౌనంగా ఉండిపోయారు' అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. 'ఇప్పుడు మాట్లాడి ఏం లాభం?' అని ఖేరా ప్రశ్నించారు.

ఉగ్ర దాడులపై ప్రధాని మాట్లాడరే?

మూడు రోజుల్లో జమ్మూకశ్మీర్‌లో మూడు ఉగ్ర దాడులు జరిగినా ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ఖేరా ప్రశ్నించారు. ఉగ్ర దాడుల గురించి మాట్లాడకుండా, పాక్ నేతల అభినందన సందేశాలపై స్పందించడానికి ప్రధానికి సమయం ఎలా దొరుకుతుందని అన్నారు. 'ప్రధాని మోదీ 'ఎందుకు రియాసిపై దృష్టి పెట్టలేదు?' అని ప్రశ్నించారు. గత 10 సంవత్సరాల మోదీ ప్రభుత్వం చేసిన బిగ్గరగా ఛాతీ కొట్టడం జాతీయ భద్రతకు హాని కలిగించిందన్నారు. అయితే దాని పర్యవసానాలను అమాయకులు అనుభవిస్తున్నారని, ఉగ్రవాదుల దాడులు యధావిధిగా కొనసాగుతున్నాయని తెలిపారు. స్వయం ప్రకటిత 'దైవ' ప్రధాన మంత్రి నుంచి బాధితులు సానుభూతితో కూడిన మాటకు అర్హులు కాలేదా? అని నిలదీశారు. గత మూడు రోజులుగా జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర దాడులు చోటుచేసుకున్నాయని ఖేరా అన్నారు. 'పాకిస్తానీ నేతలు నవాజ్ షరీఫ్, పాక్ ప్రధాని షాబాజ్ షరీఫ్ చేసిన అభినందన ట్వీట్లకు ప్రతిస్పందనలను పోస్ట్ చేయడంలో ప్రధాని మోదీ బిజీగా ఉన్నారు. భయంకరమైన ఉగ్ర దాడులపై ఆయన ఒక్క మాట కూడా ఎందుకు మాట్లాడలేదు?' అని ప్రశ్నించారు. 'జమ్మూకశ్మీర్‌లో శాంతిని సాధారణ స్థితికి తిరిగి రావడానికి బీజేపీ ఛాతీ కొట్టడం, బోలు వాదనలు పూర్తిగా బహిర్గతమయ్యాయి. కశ్మీర్ లోయలో ఎన్నికల్లో పోరాడేందుకు కూడా బీజేపీ పట్టించుకోకపోవడమే వారి 'నయా కశ్మీర్' విధానం ఘోర వైఫల్యానికి నిదర్శనం' అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా భగవత్‌పై విరుచుకుపడ్డారు. కబీర్ రాసిన ఒక ద్విపదాన్ని సామాజిక మాధ్యమిక వేదిక 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. 'కర్త రహా సో క్యోం కియా, అబ్ కరీ క్యోం పచ్చయే, బోయే పెడ్ బాబూల్ కా, అమువా కహాఁ సే పాయే' (నువ్వు ఏమి విత్తుతావో ఆ పంటే వస్తుంది)' అని పేర్కొన్నారు.

టీవీలో చూసి... ఆశ్చర్యపోయాం

ఒడిశా సీఎం భార్య ప్రియాంక

భువనేశ్వర్: ఆదివాసీ నేత మోహన్‌చరణ్ మాఝిని బీజేపీ అగ్రనాయకత్వం సీఎంగా ప్రకటించడంపై ఆయన కుటుంబం సంభ్రమాశ్చర్యాలకు గురైంది. ఇలాంటి ఓ సందర్భం వస్తుందని అనుకోలేదంటూ ఆనందం వ్యక్తం చేసింది. మోహన్ సతీమణి ప్రియాంక మాట్లాడుతూ 'నా భర్త సీఎం అవుతారని నేనెప్పుడు అనుకోలేదు. ఆయనకు మంత్రిపదవి దక్కుతుందని భావించా. ఇది మాకు చాలా గొప్పవిషయం' అని చెప్పారు. కొత్త ముఖ్యమంత్రి ఎవరొస్తారా అని టీవీ చూస్తున్న తమకు ఈ విషయం తెలిసిందన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం దిశగా ఆయన పాలన సాగిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. 'యువకుడిగా ఉన్నప్పుడే తోటివారికి సహాయం చేయడంలో ముందుండేవాడు. సర్పంచ్, ఎమ్మెల్యేగా పనిచేసిన నా కుమారుడు ఇప్పుడు ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగాడు' అని ఆయన తల్లి బాలే మాఝి సంతోషం వెలిబుచ్చారు. మోహన్‌కు ఇద్దరు కుమారులు. తమ స్నేహితులు ట్రీట్ అడుగుతున్నారంటూ వారు వెల్లడించారు. ఆయన స్వస్థలం రైకలాలో గ్రామస్థులు సంబరాలు చేసుకున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన హేమానంద బిస్వాల్, గిరిధర్ గమాంగ్ మాత్రమే ఒడిశాకు గిరిజన ముఖ్యమంత్రులుగా పనిచేయగా, ఇప్పుడు మాఝి మూడో గిరిజన ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయన తండ్రి సెక్యూరిటీ గార్డుగా పనిచేసేవారు. 1997 నుంచి 2000 వరకు మాఝి సర్పంచ్‌గా పనిచేశారు. దాంతోపాటు బీజేపీ గిరిజన మోర్చాకు ప్రధాన కార్యదర్శిగా ఉండేవారు. న్యాయశాస్త్ర పట్టభద్రుడైన మాఝి... కేంఝర్ అసెంబ్లీ స్థానం నుంచి నాలుగుసార్లు 2000, 2009, 2019, మళ్లీ 2024లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019 నుంచి 2024 వరకూ శాసనసభలో బీజేపీ సభాపక్ష కార్యదర్శిగా, చీఫ్ విప్‌గా విధులు నిర్వహించారు.

వందే భారత్‌లోనూ టికెట్ లేని ప్రయాణికులు

న్యూఢిల్లీ: సాధారణ రైళ్లు సామాన్య ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉంటాయి. కొందరు టికెట్ కొనుగోలు చేయకుండా ప్రయాణిస్తూ టీసీకి దొరికిపోయిన సందర్భాలు ఉంటాయి. కానీ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన వందేభారత్ రైలులోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీనికి సంబంధించిన వీడియో ఒకటి నెట్టింట వైరల్‌గా మారింది. అత్యాధునిక సౌకర్యాలతో రూపొందించిన ఈ రైలు... టికెట్ కొనుగోలు చేయకుండా ప్రయాణిస్తున్న వారితో కిటకిటలాడింది. లక్నో-డెహ్రాడూన్ మధ్య ప్రయాణించిన వందే భారత్ రైలులో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన వీడియోను షేర్ చేసిన ఓ వ్యక్తి ప్రీమియం రైలులో ఈ పరిస్థితి తలెత్తడంపై ఆందోళన వ్యక్తంచేశారు. నెటిజన్లు స్పందిస్తూ... దేశంలో మరికొన్ని రైళ్లను నిర్మించడం లేదా బోగీలు పెంచే ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. వైరల్‌గా మారిన ఈ వీడియోపై ఉత్తర రైల్వేశాఖ స్పందించింది. ఇది పాత వీడియో అని తెలిపింది. 'కొందరు రైతులు బలవంతంగా రైలులోకి ఎక్కినప్పుడు జరిగిన సంఘటన ఇది. పాత వీడియోను ప్రస్తుతం షేర్ చేశారు. దయచేసి ఇలాంటివి ప్రచారం చేయకండి. ప్రయాణికులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోండి' అని 'ఎక్స్' (ట్విటర్) వేదికగా పేర్కొంది.

మందిరం పేరుతో ఓట్లు ఆశించారు: పవార్

పుణె: లోక్‌సభ ఎన్నికల ద్వారా ప్రజలు రాజకీయాలను ఎలా సరిదిద్దగలరో చూపించారని ఎన్సీపీ (ఎస్పీ) నాయకుడు శరద్ పవార్ అన్నారు. బీజేపీ అభ్యర్థిని ఓడించడం ద్వారా అయోధ్య ప్రజలు మతపరమైన రాజకీయాలను ప్రోత్సహించబోమని స్పష్టంచేశారన్నారు. ప్రజలు రాజకీయాలను, మత విశ్వాసాలను కలిపి చూడరని ముందే ఊహించానన్నారు. బారామతిలో జరిగిన ఓ సమావేశంలో పవార్ మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం ఎన్నికల్లో 300 కంటే ఎక్కువ సీట్లు సాధించిన బీజేపీ...ఈసారి 240సీట్లతో సరిపెట్టుకుందన్నారు. 'బీజేపీ రామమందిరాన్ని ఎన్నికల అజెండాగా ఉపయోగించుకోవాలని భావించింది. కానీ దేశ ప్రజలు చాలా తెలివైనవారు. ఆలయం పేరు చెప్పి ఓట్లు అడుగుతున్నారని గ్రహించారు. అందుకే కాషాయ పార్టీకి 60 సీట్లు తగ్గాయి. ఈ విషయంలో ఉత్తరప్రదేశ్ కీలక పాత్ర పోషించింది. ఇక్కడి ప్రజలు వారు అనుకున్న దానికంటే భిన్నమైన తీర్పు ఇచ్చారు. వాస్తవంగా ఇక్కడ బీజేపీ ఓటమిని ఎదుర్కోవాల్సి వచ్చింది' అని శరద్ పవార్ అన్నారు. భారతదేశంలో ప్రజాస్వామ్యం చెక్కుచెదరకుండా ఉందని, దానిని అంతం చేయడం రాజకీయాల వల్ల సాధ్యం కాదని ఆయన వ్యాఖ్యానించారు. 10 ఏళ్లుగా అధికారంలో ఉన్నవారు వారికి నచ్చిన విధంగా మార్పులు చేర్పులు చేశారని, అందువల్లే ప్రజలు వారిని తిరిగి నేలమీదకు తెచ్చారని విమర్శించారు. ఇప్పుడు సొంతంగా సాధించిన మెజారిటీతో మోదీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదన్నారు. చంద్రబాబు నాయుడు (టీడీపీ), నితీశ్‌కుమార్ (జేడీయూ) సహాయంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఇతరుల సహాయంతో ప్రభుత్వాన్ని నడుపుతున్నప్పుడు అందరి ఆలోచనలకు అనుగుణంగా పాలన చేపట్టాలని, ఇక మోదీ సొంత నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం ఉండదని పవార్ పేర్కొన్నారు. అయోధ్య రామమందిరం ఉన్న ఫైజాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి అవధేశ్ ప్రసాద్ సిట్టింగ్ బీజేపీ ఎంపీ లల్లూ సింగ్‌పై 54,567 ఓట్ల తేడాతో విజయం సాధించిన విషయం విదితమే.

మంచినీటి కొరతపై ఏం చర్యలు తీసుకున్నారు?

ఆప్ ప్రభుత్వానికి ప్రశ్నలు సంధించిన సుప్రీం

న్యూఢిల్లీ: దేశ రాజధాని న్యూఢిల్లీలో మంచి నీటి కొరత నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆప్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. మహానగరంలో నీటి కొరత తీవ్రంగా ఉన్న క్రమంలో సమస్యను అధిగమించేందుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటని ఆప్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఆప్ ప్రభుత్వానికి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, ప్రసన్న బి వార్లేతో కూడిన ధర్మాసనం వివిధ ప్రశ్నలను సంధించింది. ట్యాంకర్ మాఫియా నియంత్రణతోపాటు మంచి నీటి వృథాను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటని ప్రశ్నించింది. ట్యాంకర్ మాఫియాను నియంత్రించ లేక పోతున్నారంటూ ఆప్ ప్రభుత్వంపై ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మాఫియాను అరికట్టేందుకు జోక్యం చేసుకోవాలని దిల్లీ పోలీసులను ఆదేశించమంటారా? అంటూ సుప్రీంకోర్టు ధర్మాసనం సూటిగా ఆప్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ట్యాంకర్ మాఫియాపై ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకున్నారు? వారిపై ఒక్క ఎఫ్ఐఆర్ అయినా నమోదు చేశారా? అని ప్రభుత్వాన్ని ధర్మాసనం ప్రశ్నించింది. మంచి నీరు లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని... ఈ విషయం అన్ని మీడియా ఛానెల్స్‌లో ప్రసారమవుతుందని ఈ సందర్భంగా ధర్మాసనం గుర్తు చేసింది. వేసవిలో నీరు లేక పోవడంతో మంచి నీటి వృథా అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటని ప్రభుత్వాన్ని ధర్మాసనం నిలదీసింది. ఈ అంశంపై గురువారం విచారణ చేపడతామని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. హిమాచల్‌ప్రదేశ్ అందించే మిగులు జలాలను.. న్యూదిల్లీకి సరఫరా చేసేలా హర్యానా ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ సుప్రీంకోర్టులో దిల్లీ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది.

నిర్మలా సీతారామన్ బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా నిర్మలా సీతారామన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. మోదీ మంత్రివర్గంలో వరుసగా రెండోసారి ఆర్థిక మంత్రిత్వ శాఖ చేపట్టిన తొలి మహిళగా ఆమె రికార్డు సృష్టించారు. కేంద్ర మంత్రివర్గంలో వరుసగా మూడోసారి చోటు దక్కించుకున్న మహిళగా కూడా నిలిచారు. ఆర్థిక మంత్రిగా రెండోసారి బాధ్యతలు స్వీకరించేందుకు బుధవారం నార్త్ బ్లాక్ కార్యాలయానికి చేరుకున్నప్పుడు ఆర్థిక శాఖ కార్యదర్శి టీవీ సోమనాథన్, ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల కార్యదర్శులు ఆమెకు సాదర స్వాగతం పలికారు. త్వరలోనే 2024-25 ఆర్థిక సంవత్సరానికి పూర్తి స్థాయి బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. మోదీ తొలి విడత మంత్రివర్గంలో (2014) పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రిగా నిర్మలా సీతారామన్ బాధ్యతలు చేపట్టారు. 2017లో కీలకమైన రక్షణ శాఖ బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత 2019లో రెండోసారి ప్రధాని మోదీ ఎన్నికైన తర్వాత ఏర్పాటైన కేంద్ర మంత్రివర్గంలోనూ చోటు దక్కించుకున్న నిర్మలా సీతారామన్‌కు అత్యంత కీలకమైన ఆర్థికశాఖ అప్పగించారు.

ఉగ్రదాడుల కలకలం

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో వరుస ఉగ్రఘటనలు కలకలం సృష్టిస్తున్నాయి. మూడు రోజుల వ్యవధిలో మూడుసార్లు ఉగ్రదాడులు జరిగాయి. భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో ఒక సీఆర్‌పీఎఫ్ జవాన్ అమరులయ్యారు. ఆరుగురు సిబ్బంది గాయపడ్డారని అధికారులు వెల్లడించారు. యాత్రికులే లక్ష్యంగా జమ్మూ కశ్మీర్‌లో పర్యాటక బస్సుపై ఉగ్రవాదులు జరిపిన దాడిలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. ఆదివారం ఈ ఘటన జరిగింది. అది మరువకముందే మంగళవారం సాయంత్రం కథువా జిల్లాలోని హీరానగర్ సెక్టార్‌లోని ఒక ఇంటిపై దాడి జరిగింది. ఆ ఇంటి యజమాని గాయాలపాలయ్యారు. దానిపై సమాచారం అందుకున్న పోలీసులు, పారామిలిటరీ బలగాలు నిర్వహించిన ఆపరేషన్‌లో ఒక ఉగ్రవాది హతమయ్యాడు. మరొకరి కోసం డ్రోన్ల సాయంతో గాలింపు చేపట్టారు. కేంద్రమంత్రి జితేంద్రసింగ్ ఈ వివరాలు వెల్లడిస్తూ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఒక సీఆర్‌పీఎఫ్ జవాన్ కూడా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు.

ఆ తర్వాత దోడా జిల్లాలోని భదర్వా-పఠాన్‌కోట్ రహదారి సమీపంలోని ఒక చెక్‌పోస్టుపై మంగళవారం అర్ధరాత్రి ఉగ్రదాడి జరిగింది. ఆర్మీ, పోలీసులు సంయుక్తంగా గాలింపు చర్యలు నిర్వహిస్తుండగా కొన్ని రౌండ్లు కాల్పులు జరిగినట్లు అధికారులు తెలిపారు. దాంతో రాష్ట్రీయ రైఫిల్స్‌కు చెందిన ఐదుగురు భద్రతా సిబ్బంది, ఒక పోలీసు అధికారి గాయపడ్డారు. దాంతో రెండువర్గాల మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. పూంఛ్, రాజౌరీ ప్రాంతాలతో పోలిస్తే...రియాసీలో ఉగ్ర ఘటనల తీవ్రత తక్కువ. కానీ ప్రస్తుతం అలాంటి ప్రాంతాల్లో ఉగ్రవాదులు పంజా విసురుతుండటం ఆందోళన రేకెత్తిస్తోంది. హీరానగర్ సెక్టార్‌లోని ఇంటిపై కాల్పులు జరగడానికి ముందు... ఉగ్రవాదులు కొనిన్న ఇళ్లకు వెళ్లి తాగేందుకు నీరు అడిగినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. తమ కదలికలపై గ్రామస్థులకు అనుమానం వచ్చిందని గ్రహించిన వారు ఒక ఇంటిపై దాడి చేశారు. ఈ ఘటనలో ముగ్గురు స్థానికులు మృతి చెందారని, కొంతమంది గాయపడ్డారంటూ వచ్చిన వార్తలను పోలీసు ఉన్నతాధికారులు ఖండించారు. ఒకవ్యక్తి గాయపడ్డారని స్పష్టం చేశారు.

ఉగ్రవాది ఊహాచిత్రం విడుదల

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో రియాసీ వద్ద యాత్రికుల బస్సుపై జరిగిన ఉగ్రదాడి ఘటన దర్యాప్తులో కీలక పరిణామాలు చోటుచేసుకొన్నాయి. ప్రధాన నిందితుడి ఊహా చిత్రాలను పోలీసులు విడుదల చేశారు. నిందితుడి ఆచూకీ వెల్లడిస్తే రూ.20 లక్షలు బహుమతిగా ఇస్తామని ప్రకటించారు. ఈ ఘటనకు ప్రత్యక్ష సాక్షులను పోలీసులు విచారించారు. సాక్షులు తెలిపిన వివరాల ఆధారంగా నిందితుడి స్కెచ్‌ను తయారుచేయించారు. 'రియాసీ వద్ద బస్సుపై జరిగిన ఉగ్ర దాడిలో నిందితుడి సమాచారం అందిస్తే రూ.20 లక్షల బహుమతి అందిస్తాం' అని పోలీసుశాఖ ప్రతినిధి పీటీఐకు వెల్లడించారు. గత ఆదివారం శివ్‌ఖోరీ ఆలయం నుంచి మాతా వైష్ణవీదేవి గుడికి బయల్దేరిన బస్సుపై ఉగ్రవాదులు దాడి చేశారు. ఈ వాహనంలో ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, దిల్లీకి చెందిన యాత్రికులు ఉన్నారు. దీనిపై ఉగ్రమూక కాల్పులు జరపడంతో తొమ్మిది మంది భక్తులు మృతిచెందారు. ఈ దాడి తర్వాత దోడా, కథువా జిల్లాల్లో వరుసగా ఉగ్ర ఘటనలు చోటుచేసుకొన్నాయి. నేటి ఉదయం కథువాలో జరుగుతున్న జాయింట్ ఆపరేషన్‌లో ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టారు. ఈ దాడుల్లో పాల్గొన్నవారు సుదీర్ఘకాలంగా జమ్మూకశ్మీర్‌లోనే ఉంటున్నట్లు పోలీసువర్గాలు గుర్తించాయి. తాజాగా మృతి చెందిన ఉగ్రవాది బ్యాగ్ నుంచి రూ.లక్ష నగదును అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. భారీ సంఖ్యలో తూటాలు, గ్రనేడ్లు, ఎండు పప్పులు, రొట్టెలు, ఔషధాలు, ఇంజెక్షన్లు, పెయిన్ కిల్లర్లు, రెండు ఏ4 బ్యాటరీలు, ఫోన్లు స్వాధీనం చేసుకొన్నారు. ఈ ఉగ్రవాదులు గ్రామంలో మంచినీరు కోసం ఇంటింటికీ వెళ్లడంతో సమాచారం భద్రతా దళాలకు చేరింది. నిన్న రాత్రి 8 గంటలకు ఎన్‌కౌంటర్ మొదలైంది. దీనిలో కొందరు స్థానికులు కూడా గాయపడ్డారు. ఎన్‌కౌంటర్ కారణంగా తొలుత భయపడ్డ స్థానికులు... నేటి ఉదయం నుంచి భయం వీడి ఇళ్ల బయటకు వచ్చి భద్రతా దళాలకు సాయం చేస్తున్నారు. కథువాలో నిన్న రాత్రి ఎన్‌కౌంటర్ మొదలుకాగానే అక్కడికి సుదూరంగా ఉన్న దోడా వద్ద పాక్ సైన్యం కాల్పులు ప్రారంభించింది. ఇప్పటివరకు ఓ జవాన్ సహా ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మరణించారు.

20న శ్రీనగర్‌కు మోదీ

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ జూన్ 20న జమ్మూకశ్మీర్ రాష్ట్రం శ్రీనగర్‌లో పర్యటించనున్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మోదీ ఆ కార్యక్రమంలో పాల్గొననున్నారు. యోగాను అలవాటుగా మార్చుకోవాలని మోదీ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల ప్రజలను యోగా ఏకం చేసిందని అన్నారు. యోగాను తమ జీవితాల్లో చేర్చుకోవాలనే నిబద్ధతను పునరుద్ఘాటించాలని, ఇతరులను కూడా యోగా చేసేలా ప్రేరేపించాలని మోదీ దేశ ప్రజలను కోరారు. మోదీ తన ఎక్స్ ఖాతాలో 'ఈ సంవత్సరం యోగా దినోత్సవ తేదీ సమీపిస్తోంది. యోగాను మన జీవితంలో అంతర్భాగంగా మార్చుకోవడానికి, ఇతరులను వారి జీవితంలో భాగం చేసుకునేలా ప్రోత్సహించడానికి తమ నిబద్ధతను పునరుద్ఘాటించడం చాలా అవసరం' అని పోస్ట్ చేశారు.

మ్యూజియాలకు బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ: దేశ రాజధాని దిల్లీలోని స్కూళ్లకు ఇటీవల వరుసగా బాంబు బెదిరింపులు రావడం కలకలం రేపింది. తనిఖీ చేసిన బృందాలకు బాంబులు లభ్యం కాలేదు. తాజాగా మ్యూజియాలకు బాంబు బెదిరింపు వచ్చింది. గుర్తు తెలియని వ్యక్తులు దిల్లీలోని 15 మ్యూజియాల్లో బాంబులు పెట్టామని మెయిల్ పంపారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆయా మ్యూజియాల వద్ద తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువు, పేలుడు పదార్థాలు కనిపించలేదు. ఆకతాయిలు బూటకపు మెయిల్స్ పంపారని పోలీసులు భావిస్తున్నారు.

చంద్రబాబుకు నవీన్ పట్నాయక్ అభినందనలు



భువనేశ్వర్: ఆంధ్రప్రదేశ్ కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నారా చంద్రబాబు నాయుడుకు ఒడిశా మాజీ ముఖ్యమంత్రి, బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ బుధవారం అభినందనలు తెలిపారు. చంద్రబాబు విజనరీ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి, నూతన ఆవిష్కరణలు, అభ్యుదయం దిశగా సమున్నత శిఖరాలకు చేరుతుందని తాను కచ్చితంగా చెప్పగలనని, మీకు సర్వదా విజయాలు చేకూరాలని ఆశిస్తున్నానని పట్నాయక్ తన అభినందన సందేశంలో తెలిపారు. కాగా, ఒడిశా నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్న మోహన్ చరణ్ మాఝీ బుధవారం ఉదయం నేరుగా నవీన్ పట్నాయక్‌ను కలుసుకున్నారు. తన ప్రమాణస్వీకారానికి హాజరుకావాలని ఆహ్వానించారు. ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో 147 స్థానాలకు గాను 78 స్థానాలను బీజేపీ గెలుచుకుంది.

ప్రధాని మోదీ మణిపూర్ వెళతారా? ఠాక్రే



ముంబై: ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో నెలకొన్న పరిస్థితులపై ఆర్‌ఎస్‌ఎస్ అధిపతి మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఇప్పటికైనా ప్రధాని నరేంద్ర మోదీ ఆ రాష్ట్రంలో పర్యటిస్తారా అని శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే బుధవారం ప్రశ్నించారు. ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని అందించే ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత నెలకొన్న వాస్తవ పరిస్థితి ఏమిటో కూడా తెలుసుకోవాలని కోరారు. మణిపూర్, జమ్మూకశ్మీర్‌లో పరిస్థితిని ఆయన ప్రస్తావిస్తూ..."ప్రాణాలు పోతున్నాయి. జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడులకు బాధ్యులెవరు?" అని ప్రశ్నించారు. తాను ఎన్డీయే ప్రభుత్వ భవిష్యత్తు గురించి కాకుండా దేశ భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతున్నానని ఆయన అన్నారు. నాలుగు నియోజకవర్గాలకు జరగనున్న రాష్ట్ర శాసన మండలి ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికపై శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ- శివసేన (యుబిటి), కాంగ్రెస్ లతో కూడిన ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి కూటమిలో ఎలాంటి విభేదాలు లేవని ఠాక్రే స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే పదవికి అఖిలేశ్ రాజీనామా

లక్నో: సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఉత్తరప్రదేశ్‌లోని కర్హాల్ అసెంబ్లీ సభ్యత్వానికి బుధవారం రాజీనామా చేశారు. కన్నౌజ్ లోక్‌సభ స్థానానికి అఖిలేశ్ యాదవ్ ఇటీవల ఎన్నిక కావడంతో ఎంపీ పదవిలో కొనసాగేందుకు ఆయన నిర్ణయం తీసుకున్నారు. దీంతో అసెంబ్లీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అఖిలేశ్‌తో పాటు ఫైజాబాద్ నుంచి లోక్‌సభకు ఎన్నికైన సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ నేత అవధేశ్ ప్రసాద్ సైతం తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. ఇద్దరి నేతల రాజీనామా లేఖలు తమకు అందినట్టు లెజిస్లేటివ్ అసెంబ్లీ కార్యాలయ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రదీప్ దూబే ధ్రువీకరించారు. అఖిలేశ్ యాదవ్ 2022 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో కర్హాల్ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. అప్పట్నించి రాష్ట్ర అసెంబ్లీలో విపక్ష నేతగా కొనసాగుతున్నారు. ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో కన్నౌజ్ నియోజకవర్గంలో 1,70,99 ఓట్ల ఆధిక్యంతో బీజేపీ అభ్యర్థి సుబ్రత్ పాఠక్‌పై అఖిలేశ్ ఘనవిజయం సాధించడంతో పార్లమెంటు సీటును ఉంచుకుని... ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని మంగళవారం నిర్ణయించుకున్నారు. పార్టీ కార్యకర్తలతో సంప్రదించే ఈ నిర్ణయం తీసుకున్నట్టు మీడియాకు ఆయన తెలిపారు. అసెంబ్లీలో విపక్ష నేతగా ఎవరిని ఎంపిక చేస్తారని ప్రశ్నించగా పార్టీ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. కాగా, సమాజ్‌వాద్ పార్టీ తరపున లోక్‌సభా పక్ష నాయకుడిగా అఖిలేశ్ ఉంటారని ఆ పార్టీ ప్రకటించింది.

పోక్సో కేసులో యడియూరప్పకు సీఐడీ నోటీసులు

బెంగళూరు: పోక్సో కేసులో విచారణకు హాజరు కావాలని కర్నాటక మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు యడియూరప్పకు సీఐడీ నోటీసులు జారీ చేసింది. యడియూరప్ప ప్రస్తుతం దిల్లీలో ఉన్నారని, బెంగళూరు రాగానే సీఐడీ ముందు విచారణకు హాజరవుతారని ఆయన సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో 17 ఏళ్ల బాలిక పట్ల యడియూరప్ప అసభ్యంగా ప్రవర్తించి, లైంగిక వేధింపులకు గురి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. బాధిత బాలిక తల్లి మార్చి 14వ తేదీన సదాశివనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును సీఐడీకి అప్పగిస్తూ కర్నాటక డీజీపీ అలోక్ మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో యడియూరప్పకు నోటీసులు జారీ అయ్యాయి. తాను ఎవర్నీ లైంగికంగా వేధించలేదని, ఈ కేసు విషయంలో న్యాయ పోరాటం చేస్తానని యడియూరప్ప గతంలో ప్రకటించారు. ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధపడుతున్న బాధితురాలి తల్లి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గత నెలలో చనిపోయారు. ఈ కేసులో బాధితురాలితో పాటు ఆమె తల్లి వాంగ్మూలాన్ని సీఐడీ అధికారులు నమోదు చేశారు.

ప్రమాణ స్వీకారం చేసిన ఏపీ మంత్రులు

నారా లోకేష్

కె.అచ్చెన్నాయుడు

కొల్లు రవీంద్ర

నాదెండ్ల మనోహర్

పి.నారాయణ

ఫరూక్

టీజీ భరత్

వాసంశెట్టి సుభాష్

కందుల దుర్గేష్

బీసీ జనార్థన్

సత్యకుమార్

అనగాని సత్యప్రసాద్

పయ్యావుల కేశవ్

గుమ్మడి సంధ్యారాణి

మండిపల్లి రాంప్రసాద్

నిమ్మల రామానాయుడు

కొండపల్లి శ్రీనివాస్

వంగలపూడి అనిత

ఆనం రామనారాయణరెడ్డి

వీరాంజనేయస్వామి

గొట్టిపాటి రవికుమార్

కొలుసు పార్థసారధి

ఎస్.సవిత

ఎన్డీఏలో అంతర్గత పోరు

- లోక్‌సభ ఎన్నికల్లో ఓటమిపై పరస్పర నిందలు
- బీజేపీ వైఖరిపై షిండే, అజిత్ పార్టీల్లో అసంతృప్తి
- మహారాష్ట్రలో రాజకీయ వేడి

ముంబై: మహారాష్ట్ర రాజకీయాలు ఎప్పుడూ వేడివేడిగానే ఉంటాయి. సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత ఆ రాష్ట్ర ఎన్డీఏ కూటమిలో అంతర్గత పోరు మొదలైంది. ఓటమికి మీరు కారణమంటే మీరు కారణమంటూ కూటమి పక్షాలు భారతీయ జనతా పార్టీ (బీజేపీ), అజిత్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ), ఏక్‌నాథ్ షిండే శివసేన పరస్పరం నిందించుకుంటున్నాయి. మోదీ 3.0 సర్కారులో స్వతంత్ర బాధ్యత కలిగిన సహాయ మంత్రిగా పార్టీ నాయకుడు ప్రఫుల్ పటేల్‌కు స్థానం కల్పిస్తామన్న బీజేపీ ప్రతిపాదనను అజిత్ నేతృత్వంలోని ఎన్సీపీ తిరస్కరించింది. దీనిపై పటేల్ మీడియాతో మాట్లాడుతూ తాను గతంలో కేంద్ర కేబినెట్ మంత్రిగా పనిచేశానని, సహాయమంత్రిగా బాధ్యతలు చేపట్టడం తనవంటి సీనియర్ నాయకుడిని అవమానించ డమేనని అన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత ఎన్సీపీ బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడటం ఇదే తొలిసారి కాదు. వాస్తవానికి జూన్ 4న ఫలితాలు వెలువడిన మరుసటి రోజు దిల్లీలో జరిగిన ఎన్డీయే మిత్రపక్షాల తొలి సమా వేశాన్ని అజిత్ దాటవేశారు. ఆ పార్టీ పోటీ చేసిన నాలుగు స్థానాల్లో అజిత్ ఎన్సీపీ ఒక్కటి మాత్రమే దక్కించుకో గలిగింది. ఇండియా కూటమిలోని శరద్ పవార్ నేతృత్వం లోని వర్గం ఘన విజయాలు అందుకుంది. ఆ పార్టీ పోటీ చేసిన పది సీట్లలో ఎనిమిది స్థానాలను గెలుచుకుంది. ఇక తన పార్టీ పేలవమైన ప్రదర్శనపై అజిత్ స్పందిస్తూ... తన పార్టీ అభ్యర్థులకు బీజేపీ సహకరించలేదని ఆరోపించారు. ముఖ్యంగా సుప్రియా సూలేపై బారామతిలో పోటీ చేసి 1.5 లక్షల ఓట్ల తేడాతో ఓడిపోయిన తన భార్య సునేత్రా పవార్ విజయానికి బీజేపీ సహకరించలేదని ఆరోపించారు. ఫలితాలను విశ్లేషిస్తూ... పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగాన్ని మారుస్తామని కొందరు బీజేపీ నేతలు చేసిన ప్రకటనల కారణంగా పార్టీ ఎన్నికల పునాది కదిలిందని అజిత్ పేర్కొన్నారు. ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన కూడా తమ కు కేవలం స్వతంత్ర బాధ్యత కలిగిన సహాయమంత్రి పదవి దక్కడంపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. 'మేము కేబినెట్ బెర్త్ కోసం ఎదురు చూస్తున్నాము' అని పార్టీ చీఫ్ విప్ శ్రీరంగ్ బార్నే బహిరంగంగానే వ్యాఖ్యానించారు. తక్కువ మంది ఎంపీలు గెలుచుకున్న ఇతర భాగస్వామ్య పార్టీలకు కేబినెట్ బెర్త్‌లను అందించడాన్ని బార్నే ప్రస్తావించారు. షిండే శివసేన పోటీ చేసిన 15 స్థానాల్లో ఏడు స్థానాల్లో గెలుపొందింది. రాష్ట్రంలో 28 స్థానాల్లో పోటీచేసి తొమ్మిది మాత్రమే గెలుచుకున్న బీజేపీ కంటే తమ పార్టీ మెరుగ్గా పని చేసిం దని బార్నే పేర్కొన్నారు. అయితే శివసేన ఒక ప్రకటన జారీ చేయడం ద్వారా బార్నే వాదనను తగ్గించడానికి ప్రయత్నించింది. 'మేము బేషరతుగా ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నామని ఇప్పటికే స్పష్టం చేశాము. ఈ దేశం ప్రధాని మోదీ నాయకత్వాన్ని కోరింది. అధికారం కోసం బేరసారాలు లేదా చర్చలు లేవు. సైద్ధాంతిక కూటమికి మేము బేషరతు మద్దతునిచ్చాము' అని పేర్కొంది.

ఎంవీఏలోనూ విభేదాలు

ఇక ఉద్ధవ్ ఠాక్రే శివసేన, శరద్ పవార్ ఎన్సీపీ, కాంగ్రెస్‌లతో కూడిన మహావికాస్ అఘాడి (ఎంవీఏ) కూటమిలో పరిస్థితులు అంత సానుకూలంగా కనిపించడం లేదు. 2020లో ఎంవీఏ ఆవిర్భవించినప్పటి నుంచి సామరస్యపూర్వకంగా పనిచేసిన ఈ పార్టీల మధ్య కూడా విభేదాలు చెలరేగినట్లు సమాచారం. రాబోయే రాష్ట్ర శాసన మండలి పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల్లో పోటీ చేయాలని కాంగ్రెస్ ఆశించింది. రెండు స్థానాల్లో (కొంకణ్, నాసిక్) పోటీ చేసి, మిగిలిన రెండింటిలో సేన పోటీ చేస్తుందని అంచనా వేసింది. అయితే తమ పార్టీ నాలుగు స్థానాల్లోనూ పోటీ చేస్తుందని ఠాక్రే ప్రకటించారు. కాంగ్రెస్‌ను సంప్రదించకుండానే నిర్ణయం తీసుకున్నారని ఆ పార్టీ నేత పటోలే పేర్కొన్నారు. 'మేము ఉద్ధవ్ ఠాక్రేని సంప్రదించడానికి ప్రయత్నించాము. కానీ ఆయన విదేశాలలో ఉన్నారు. సమయానికి చేరుకోలేకపోయారు' అన్నారు.

ఎన్సీపీ (ఎస్పీ)లో విభేదాలు

ఎన్సీపీ 25వ వ్యవస్థాపక సంవత్సర వేడుకల సందర్భంగా శరద్‌పవార్ వర్గానికి కంచుకోటలుగా భావించే ప్రాంతాల్లో ఒకటైన అహ్మద్‌నగర్‌లో ఎన్సీపీ (ఎస్పీ) వేడుకలను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పార్టీ నుండి ఎన్నికైన ఎమ్మెల్యే, శరద్ పవార్ మనవడు రోహిత్ పవార్, రాష్ట్ర పార్టీ చీఫ్ జయంత్ పాటిల్‌పై బహిరంగంగా విరుచుకుపడ్డారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎన్సీపీ (ఎస్పీ) పోటీ చేసిన పది స్థానాల్లో ఎనిమిది స్థానాల్లో విజయం సాధించింది. ఫలితాలు వెలువడిన వెంటనే ఆనందోత్సాహాలలో భాగంగా, పార్టీని విజయపథంలో నడిపించిన 'జనరల్'గా పాటిల్‌ను సూచిస్తూ అనేక పోస్టర్లు వెలిశాయి. దీనిపై రోహిత్ మాట్లాడుతూ... పార్టీ విజయా నికి ఏ 'జనరల్' కారణం కాదన్నారు. పార్టీ విజయం కోసం శ్రమించిన కార్యకర్తలను అభినందించాలని అన్నారు. పార్టీలో రోహిత్, పాటిల్ మధ్య అసంతృప్తులు చెలరేగిన సంగతి తెలిసిందే. పార్టీలో ప్రముఖ స్థానం కోసం మాజీలు ప్రయత్నిస్తున్నారని ప్రచారం జరుగు తోంది. ఇదే కార్యక్రమంలో పాటిల్ స్పందిస్తూ... ఎవరికైనా తనపై అభ్యంతరాలుంటే నేరుగా శరద్‌పవార్‌తో మాట్లాడాలని లేదా తన వద్దకు రావాలని అన్నారు.

'మరత్వాడా'లో వర్ష బీభత్సం

పదిరోజుల్లో 14 మంది మృతి

ముంబై: మహారాష్ట్రలోని మరత్వాడా ప్రాంతంలో వర్షం బీభత్సం సృష్టించింది. జూన్ 1 నుంచి ప్రారంభమైన వర్షాల ప్రభావంతో.. ఇప్పటి వరకు 14 మంది మృతి చెందారు. ఇందులో పిడుగుపాటు కారణంగా 11 మంది మృతి చెందారు. డివిజనల్ కమిషనర్ కార్యాలయం రూపొందించిన ప్రాథమిక సర్వే నివేదిక ప్రకారం.. గత రెండు రోజుల్లో పర్భానీ, హింగోలి జిల్లాల్లో నాలుగు మరణాలు నమోదయ్యాయి. జూన్ 1 నుంచి ఇప్పటివరకు మరత్వాడాలోని ఏడు జిల్లాల్లో వర్షాల కారణంగా 14 మంది ప్రాణాలు కోల్పోయారు. అందులో నాలుగు మరణాలు గత రెండు రోజుల్లోనే సంభవించాయి. నలుగురు బాధితుల్లో ఇద్దరు 14 ఏళ్ల బాలుడు, 40 ఏళ్ల మహిళ ఉన్నారు. వరద నీటిలో కొట్టుకుపోయి ఇద్దరు మృతి చెందగా, ఆవుల కొట్టం కూలి ఒకరు మృతి చెందారు. మరాత్వాడాలోని మొత్తం ఎనిమిది జిల్లాల్లో ఏడింటిలో ఈ మరణాలు సంభవించాయి. సర్వే నివేదిక ప్రకారం, లాతూర్ జిల్లాలో అత్యధికంగా నాలుగు మరణాలు సంభవించగా, పర్భానీ మరియు నాందేడ్ ఒక్కొక్కటి మూడు మరణాలు నమోదయ్యాయి. మరో నాలుగు జిల్లాలు.. జల్నా, హింగోలి, బీడ్ మరియు ధరాశివ్ ఒక్కొక్కరు మరణించారు. జూన్ 1 నుంచి మరాత్వాడాలోని మొత్తం ఎనిమిది జిల్లాల్లో ప్రకృతి వైపరీత్యాల కారణంగా మనుషులే కాకుండా 251 జంతువులు కూడా ప్రాణాలు కోల్పోయాయి. గత రెండు రోజుల్లో 99 జంతువులు చనిపోయాయి. మరోవైపు.. బీడ్ జిల్లాలో గత రెండు రోజుల నుంచి వర్షం కురుస్తూనే ఉంది. దీంతో.. మజల్‌గావ్ తాలూకాలోని కోతల గ్రామంలో రాత్రి కురిసిన భారీ వర్షానికి నదికి వరద పోటెత్తింది. లాతూర్ జిల్లాలోని నెల్వాడ్ గ్రామంలో వ్యవసాయం భూమి, రోడ్లు జలమయమయ్యాయి. గ్రామం నుంచి బయటకు వెళ్లే రహదారిపై నుంచి నీరు ప్రవహించడంతో గ్రామస్తులు బయటకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ భూమిలోకి నీరు చేరడంతో మట్టి కొట్టుకుపోయింది. వాగులు పొంగి పొర్లడంతో రహదారులు మూసుకుపోయాయి. కాగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జూన్ 12 నుంచి ఎల్లో అలర్ట్, ఆరెంజ్ అలర్ట్‌లను వాతావరణ శాఖ ప్రకటించింది.

పాక్ ఉగ్రవాదికి క్షమాభిక్ష నిరాకరణ

న్యూదిల్లీ: ఇరవై నాలుగేళ్ల క్రితం దేశ రాజధాని దిల్లీలోని ఎర్రకోటపై ఉగ్రదాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ కేసులో దోషిగా నిర్ధారణ అయిన పాకిస్థాన్ ఉగ్రవాది మహ్మద్ ఆరిఫ్ అలియాస్ అష్ఫాక్ దాఖలు చేసుకున్న క్షమాభిక్ష పిటిషన్ ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తోసిపుచ్చారు. ఈ కేసులో పాక్ ఉగ్రవాది మహ్మద్ ఆరిఫ్ కు న్యాయస్థానం మరణశిక్ష విధించింది. 2022 నవంబరు 3న అతడి రివ్యూ పిటిషన్ ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దాంతో... అతడికి మరణశిక్ష ఖరారైంది. ఈ నేపథ్యంలో మే 15న ఆరిఫ్ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును క్షమాభిక్ష కోరాడు. అయితే అతడి పిటిషన్ ను ముర్ము మే 27న తోసిపుచ్చగా, మే 29న ఆ మేరకు అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. 2000 సంవత్సరం డిసెంబరు 22న ఎర్రకోట వద్ద నెం.7 రాజ్ పుటానా రైఫిల్స్ సైనిక స్థావరంపై పాక్ ఉగ్రవాదులు దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో ముగ్గురు భారత జవాన్లు మరణించారు. ఈ దాడి జరిగిన నాలుగు రోజుల తర్వాత దిల్లీ పోలీసులు పాక్ ఉగ్రవాది మహ్మద్ ఆరిఫ్ ను అరెస్ట్ చేశారు. అతడు నిషిద్ధ లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ సభ్యుడని గుర్తించారు. ఆరిఫ్ ఈ దాడికి ఇతర ఉగ్రవాదులతో కలిసి కుట్ర పన్నాడన్న అభియోగాలు కోర్టులో నిరూపణ అయ్యాయి. ఆనాడు ఎర్రకోటపై దాడికి పాల్పడిన అబు షాద్, అబు బిలాల్, అబు హైదర్ వేర్వేరు ఎన్‌కౌంటర్లలో హతమయ్యారు.

హత్య కేసులో కన్నడ హీరో

దర్శన్‌కు బిగుస్తున్న ఉచ్చు

పోలీసుల చేతికి కీలక ఆధారాలు

బెంగళూరు: కన్నడ హీరో దర్శన్‌ను హత్య కేసులో పోలీసులు అరెస్ట్ చేయడం సంచలనం రేపింది. తన ప్రియురాలు పవిత్ర గౌడ్‌కు రేణుకాస్వామి అనే వ్యక్తి కొన్నిరోజులుగా అసభ్య మేసేజ్‌లు, అశ్లీల ఫోటోలు పంపుతున్నాడని ఫిర్యాదు రావడంతో కోపంతో రగిలిపోయి 10 మందికి సుపారీ ఇచ్చి చిత్రదుర్గకు చెందిన రేణుకా స్వామిని హత్య చేయించారని దర్శన్‌పై ఆరోపణ లొచ్చాయి. ఈ కేసులో మైసూర్ లోని తన ఫామ్ హౌస్‌లో దర్శన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా ఈ కేసులో దర్శన్‌కి మరింత ఉచ్చు బిగుసుకుంది. పోలీసుల చేతికి కీలక ఆధారాలు లభించినట్లు వార్తలు వస్తున్నాయి. చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి అనే వ్యక్తి హత్యకు సంబంధించిన కేసులో దర్శన్‌ని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ కేసులో రేణుకాస్వామి హత్యానంతరం మృతదేహాన్ని తరలించేందుకు వినియోగించిన కారును పోలీసులు సీజ్ చేశారు. కన్నడ చిత్రసీమలో అగ్ర హీరోల్లో ఒకరు దర్శన్. ఓ మామూలు వ్యక్తిని ఎందుకు చంపించాడని సినీ పరిశ్రమతో పాటు అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. తాజాగా సీసీటీవీ ఫుటేజ్‌లో కనిపించిన రెడ్ స్కార్పియో కారు దర్శన్ దే అని నిర్ధారణకు వచ్చారు పోలీసులు. పవిత్ర గౌడను ఆన్‌లైన్ లో వేధింపులకు గురి చేసిన రేణుకాస్వామిని కావాలని హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. చిత్ర దుర్గలో నమోదైన మిస్సింగ్ కేసు ఫిర్యాదులో భాగంగా పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టగా... కీలక ఆధారాలు లభ్యమవుతున్నాయి. రేణుకా స్వామి హత్య కేసులో మొదట ముగ్గురు లొంగిపోయారు. వారి ద్వారా దర్శన్ పేరు వెలుగులోకి వచ్చింది. దర్శన్‌తో పాటు మరో పదిమందిని ఈ హత్య కేసులో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. గత ఆరేళ్లుగా పవిత్ర గౌడ తో దర్శన్ సహజీవనంలో ఉంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే పవిత్ర గౌడ తనను రేణుకాస్వామి వేధిస్తున్నాడని దర్శన్ కి చెప్పడంతో కోపంతో ఈ పని చేసి చేసినట్లు వార్తలు వస్తున్నాయి. తాజాగా పోలీసులకు లభించిన సీసీటీవి ఫుటేజ్ కీలక ఆధారంగా మారడంతో రేణుకాస్వామి హత్య కేసులో దర్శన్ కి గట్టిగానే ఉచ్చు బిగిస్తున్నట్లు తెలుస్తోంది.

ఎన్నికల్లో మా పనితీరు సంతృప్తికరంగా లేదు

- పోరాట సామర్థ్యానికి... ఎన్నికల్లో పోటీకి అంతరం ఉంది
- దానిపై తీవ్రమైన ఆత్మ పరిశీలన చేసుకుంటాం
- సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి



న్యూదిల్లీ: సీట్లు స్వల్పంగా పెరిగినప్పటికీ లోక్‌సభ ఎన్నికల్లో తమ పనితీరు పట్ల సీపీఎం సంతృప్తి చెందలేదని, క్షేత్రస్థాయిలో పోరాటాలను ప్రారం భించగల దాని సామర్థ్యానికి, సీట్లు గెలుచుకునే దాని శక్తికి మధ్య ఉన్న అంతరాన్ని ఎలా పూడ్చుకోవాలో అది తీవ్రమైన ఆత్మ పరిశీలన చేసుకుంటుందని పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తెలిపారు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ వామపక్ష పార్టీలు అనేక ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించినప్పటికీ, దాని ప్రభావం ఎన్నికల పనితీరులో ప్రతిబింబించకపోవడంతో పార్టీలో కొంత నిరాశ ఉందన్నారు. ప్రస్తుతం వామ పక్షాలు పాలిస్తున్న ఏకైక రాష్ట్రమైన కేరళలో బీజేపీ ప్రవేశం గురించి అడిగిన ప్రశ్నకు, వామ పక్షాల ఓట్ల శాతం చెక్కుచెదరకుండా ఉందని, అయితే కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) ఓట్లు కాషాయ పార్టీ వైపు మళ్లాయని ఏచూరి అన్నారు. ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో వామపక్ష పార్టీలు 17వ లోక్‌సభలో ఐదు నుంచి లోక్‌సభలో తమ సంఖ్యను ఎనిమిదికి పెంచుకున్నాయి. సీపీఎం నాలుగు స్థానాల్లో, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రెండేసి స్థానాలను గెలుచుకున్నాయి. 'వామపక్షాలు లోక్‌సభలో తన ఉనికిని స్వల్పంగా పెంచుకున్నాయి. కానీ మేము సంతోషంగా లేము. వాస్తవానికి, వామపక్షాల నేతృత్వంలో ఎన్ని పోరాటాలు జరిగినప్పటికీ, ఎన్నికల పనితీరు పరంగా మేము దానిని నిజంగా ఉపయోగించుకోలేక పోయినందుకు కొంచెం నిరాశ చెందాము' అని ఏచూరి అన్నారు. 'తీవ్రమైన ఆత్మపరిశీలన అవసరం. మేము దానిని చేపట్టి అవసరమైన దిద్దుబాట్లను అమలు చేస్తాం. తద్వారా రాబోయే రోజుల్లో వామపక్షాల సామర్థ్యం, ప్రజా పోరాటాలను నిర్వహించే, నిలబెట్టగల దృఢ సంకల్పం, ఎన్నికల పనితీరు మధ్య అసమతుల్యత తగ్గింది' అని ఆయన అన్నారు. రైతుల పోరాటం, ఉపాధి కోసం యువత పోరాటం, విద్యావ్యవస్థ చుట్టూ ఉన్న సమస్యలు, నీట్ పరీక్షల చుట్టూ ఇటీవలి ఆందో ళనల వంటి ప్రజల జీవనోపాధి సమస్యల చుట్టూ పోరాటాలను ఉధృతం చేస్తామని తెలిపారు. 'ఇవి పార్లమెంటు లోపలా, బయటా జరిగే పోరా టాలు' అని ఏచూరి చెప్పారు. త్రిసూర్ స్థానంలో బీజేపీ అభ్యర్థి సురేష్ గోపీ గెలుపొందడంపై ప్రశ్నించగా, యూడీఎఫ్ ఓట్లను బీజేపీ చీల్చిందని అన్నారు. 'ఇప్పుడు అది చాలా ఆందోళనకరం. కాంగ్రెస్ పునాది బీజేపీ వైపు కదులుతున్నట్లయితే, అది కేరళకు మాత్రమే కాకుండా దేశంలోని ఇతర ప్రాంతాలకు తీవ్ర మైన ఆందోళన కలిగించే విషయం. అందువల్ల మన దేశం కోసం అది నియంత్రించ బడుతుం దని ఆశిస్తున్నాను' అని పేర్కొన్నారు. ఏచూరి ప్రకారం, తాజా ఎన్నికల్లో మతపరమైన ధ్రువ ణాన్ని సృష్టించడానికి బీజేపీ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. రామ మందిరం ఉన్న అయోధ్యలోని ఫైజాబాద్ స్థానాన్ని కోల్పోవడమే అతిపెద్ద ఉదాహరణ. 'అలాగే కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేయడం వల్ల వారు కశ్మీర్‌లో ఏ సీటును గెలుచుకోలేకపోయారు. అందువల్ల వారు అంచనా వేసిన వారి ఆ అజెండా దెబ్బతింది. కానీ అది ప్రాథమికంగా రాజ్యాంగంపై, ప్రజల జీవనోపాధిపై దాడుల కారణంగా ఉంది' అని ఏచూరి తెలిపారు.

ఆస్తికోసం మామను హత్య చేయించిన కోడలు

- పక్కాగా కుట్ర అమలు
- రూ.300 కోట్ల ఆస్తిపై కన్ను

నాగ్‌పూర్: మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఘోరం జరిగింది. ఆస్తి కోసం ఓ కోడలు పక్కా ప్లాన్‌లో 82ఏళ్ల మామగారిని హత్య చేయించింది. రూ.300 కోట్ల ఆస్తి కోసం పన్నిన దారుణమై కుట్ర వెలుగులోకి వచ్చింది. టౌన్ ప్లానింగ్ విభాగంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా అర్చన మనీష్ పుట్టేవార్... గత వారం 82 ఏళ్ల తన మామ పురుషోత్తం పుట్టేవార్‌ని ప్లాన్ చేసి హతమార్చింది. 15 రోజుల క్రితం పురుషోత్తం కారు ఢీకొట్టడంతో మరణించారు. ఈ కేసును లోతుగా పరిశీలించిన పోలీసులు నిజం నిగ్గు తేల్చారు. నిందితురాలైన అర్చనను పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.1 కోటి సుపారీగా ఇచ్చి ఆమె మామను హత్య చేయించింది. అర్చన తన మామను చంపేందుకు నిందితులకు కారు కొనేందుకు డబ్బులు కూడా ఇచ్చింది. కారు ఢీకొట్టడాన్ని ప్రమాదంగా చూపించి తప్పించుకోవాలనే ప్రయత్నం చేసినట్లు విచారణలో వెల్లడైంది. పురుషోత్తంకి సంబంధించిన రూ. 300 కోట్ల విలువైన ఆస్తులపై తన పట్టు సాధించేందుకు ఇలా చేసినట్లు పోలీసులు తెలిపారు. 53 ఏళ్ల అర్చన... తన భర్త డ్రైవర్ అయిన బాగ్డేతో పాటు ఇద్దరు నిందితులు నీరజ్ నిమ్జే, సచిన్ ధార్మిక్‌లతో కలిసి హత్యకు పథకం వేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు హత్యతో పాటు మోటార్ వాహనాల చట్టంలోని ఇతర సెక్షన్ల కింది అభియోగాలు మోపారు. రెండు కార్లు, బంగారు నగలు, మొబైల్ ఫోన్లను నిందితుల వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఘటన జరిగిన రోజున సర్జరీ అయి కోలుకుంటున్న తన భార్య శకుంతలను కలిసేందుకు పురుషోత్తం పుట్టేవార్ ఆస్పత్రికి వెళ్లినట్లు విచారణలో తేలింది. తిరిగి వస్తున్న క్రమంలో కారు అతడి పైనుంచి దూసుకెళ్లింది.పురుషోత్తం కుమారుడు, అర్చన భర్త మనీష్ డాక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈ హత్య విచారణ సమయంలోనే అర్చన పనిచేస్తున్న టౌన్ ప్లానింగ్ విభాగంలో స్థానిక ఎమ్మెల్యే అక్రమాలను కనుగొన్నారు. అయితే, ఆమెకు ఉన్న రాజకీయ సంబంధాల కారణంగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని విచారణలో తేలింది. నిబంధనలను ఉల్లంఘించిన అక్రమ లేఅవుట్లను క్లియర్ చేశారంటూ ఆమెపై ఆరోపణలు వచ్చాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.